
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 3 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (బుధవారం) : 6.23
సహరి (గురువారం) : 4.44

ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.0	26.0
కావలి	37.0	27.0
కందుకూరు	37.0	27.0
ఆత్మకూరు	41.0	27.0
ఉదయగిరి	41.0	24.0







ప్రతిపక్షాలే టార్గెట్‌గా కేసులు... జరుగుతున్న అక్రమాలపై ఆధారాలతోసహా ఫిర్యాదు చేసినా లెక్కలేనితనం.. అధికార పార్టీ తరపున సొంత మామ ప్రచారం చేయడం.. అన్నిటికీ మించి సాక్షాత్తు ప్రధాని మోదీ పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యం ఇలా అనేక కారణాలు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి జిల్లాను వీడేలా చేశాయి. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎటువంటి ఎన్నికల విధులు తిరుమలేశ్వరరెడ్డికి అప్పగించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘం తన ఆదేశాల్లో పేర్కొనడం తీవ్రతను తెలియజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు కలెక్టర్లు, ఐదుగురు ఎస్పీలు, ఒక డీఐజీని ఈసీ బదిలీ చేసింది. అందులో జిల్లా ఎస్పీతోపాటు గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు కూడా ఉండటం గమనార్హం. వీరద్దరి బదిలీ జిల్లా పోలీసు శాఖనే కాకుండా అధికార యంత్రాంగం మొత్తం ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. కాగా, ఇన్చార్జి ఎస్పీగా అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య నియమితులయ్యారు.

తిరుమలేశ్వరరెడ్డి పైనే తొలి వేటు!

- జిల్లా ఎస్పీకి స్థానచలనం
- ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు
- కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంతో సంచలనం
- వైసీపీతో అంటకాగుతున్నట్లు అనేక ఆరోపణలు
- ప్రధాని సభలో వైఫల్యమే ప్రధాన కారణం
- ఎస్పీ మామ వైసీపీ నాయకుడు కావడం మరో కారణం
- మూడు రోజుల క్రితం ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- అధికార యంత్రాంగంలో కలకలం

నెల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దాదాపు ఏడాది క్రితం తిరుమలే శ్వరరెడ్డి ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. అయితే మొదటి నుంచీ ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్ష నేతలే టార్గెట్‌గా క్షేత్రస్థాయిలో తప్పుడు కేసులు నమోదు చేస్తున్నా ఎస్పీ పట్టించుకోలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తూ వచ్చాయి. ఎస్పీ బదిలీకి ప్రధాన కారణం ప్రధానమంత్రి మోదీ సభలో భద్రత వైఫల్యమేనని ఉన్నత వర్గాలు చెబుతున్నాయి. గత నెల 17వ తేదీన చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎన్నికల ప్రచార సభకు నరేంద్రమోదీ హాజరయ్యారు. ఆ సభలో భద్రత చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. ఏకంగా వీఐపీ గ్యాలరీలోకి వాటర్ బాటిళ్లు విసరడం, గ్యాలరీవైపు జనాలు దూసుకురావడంతో ప్రధానమంత్రి భద్రతా సిబ్బంది వారిని నిలువరించాల్సిన పరిస్థితి దాపురించింది. ఆ వీఐపీ గ్యాలరీకి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించింది తిరుమలేశ్వరరెడ్డి అని చెబుతున్నారు. ప్రధాని సభలో పోలీసు వైఫల్యంపై ఇంటెలిజెన్స్ బ్యూరో కేంద్ర హోం శాఖ, ఎన్నికల కమిషన్‌కు నివేదికను అందజేసింది. అదేవిధంగా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మామ దుగ్గిరెడ్డి గురువారెడ్డి వైసీపీ నాయకుడు కావడం కూడా ఆయన బదిలీకి మరో కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై మూడు రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. తిరుమలేశ్వరరెడ్డి మామ వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, వైసీపీ నాయకులు ఎస్పీ ఇంటికి రాకపోకలు సాగిస్తూ లాబీయింగ్ చేస్తున్నారంటూ ఫిర్యాదులో ఆరోపించారు. అలానే పొదలకూరు మండలంలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా ఎస్పీ పట్టించుకోవడం లేదంటూ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఇటీవల ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులన్నింటిపైన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. వీటన్నింటి నేపథ్యంలో తిరుమ లేశ్వరరెడ్డిపై ఎన్నికల కమిషన్ వేటు వేసినట్లు చెప్పు కుంటున్నారు. మరోవైపు అదనపు ఎస్పీ సీహెచ్.సౌజన్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

● త్వరలో మరిన్ని సంచలనాలు?

ఎస్పీపై వేటుతో ఒక్కసారిగా జిల్లాలో కలకలం రేగగా త్వరలో ఇటువంటి సంచలనాలే మరిన్ని జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో అనేక మంది అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. కొందరు కోడ్ వచ్చినా వైసీపీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ హరినారాయణన్‌ను బదిలీ చేయాలని, ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరుతూ టీడీపీ సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. పొదలకూరు మండలంలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా కలెక్టర్ పట్టించుకోవడం లేదని, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దోపిడీకు కలెక్టర్ సహకరిస్తున్నారని తన ఫిర్యాదులో ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కలెక్టర్‌ను బదిలీ చేసి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని సోమిరెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. అలానే మంత్రి కాకాణి దగ్గర వ్యక్తిగత సిబ్బందిగా పని చేస్తున్న ఎంపీడీవో సరళపై కూడా చర్యలు తీసుకో వాలంటూ మరో లేఖను ఎన్నికల కమిషన్‌కు రాశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం మూడేళ్లు ఒక జిల్లాలో పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉందని, ఏ సరళ వెంకటాచలం ఎంపీడీవోగా మూడేళ్లు పనిచేసి ఆ తర్వాత ఇప్పుడు మంత్రి వద్ద పనిచేస్తూ ఇంకా జిల్లాలోనే ఉన్నారని పేర్కొన్నారు. ఇక మూడేళ్లు దాటిన, సొంత జిల్లాలో పనిచేస్తున్న డీఆర్డీఏ పీడీ, జిల్లా పంచా యతీ అధికారి, జిల్లా ఆడిట్ అధికారులను బదిలీ చేయాలంటూ టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో రానున్న రోజుల్లో ఈసీ ఎటువంటి చర్యలు తీసుకుంటుందా.. అన్నది ఆసక్తిగా మారింది.

కాంగ్రెస్ అభ్యర్థులు వీరే!

● నెల్లూరు సిటీ, కావలి మినహా మిగిలిన స్థానాలకు ఖరారు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఖరారు అయ్యారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలకుగాను ఆరింటికి అభ్యర్థుల పేర్లను మంగళవారం పీసీసీ చీఫ్ వైఎస్.షర్మిల ప్రకటించారు. నెల్లూరు నగరం, కావలి స్థానాలకు మాత్రం ఎవరినీ నియమించలేదు. అలాగే నెల్లూరు పార్లమెంట్ స్థానాన్ని కూడా పెండింగ్‌లో ఉంచారు.

నెల్లూరు రూరల్ అభ్యర్థిగా షేక్ ఫయాజ్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు రూరల్ కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ ఫయాజ్ నియమితులయ్యారు. నగరంలోని కోటమిట్ట ప్రాంతానికి చెందిన ఫయాజ్ 25 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో కొనసాగు తున్నారు. సామాన్య కార్యకర్తగా పార్టీలో చేరిన ఫయాజ్ మైనారిటీ నగర అధ్యక్షుడిగా, పీసీసీ డెలి గేట్ మెంబర్‌గా, ప్రస్తుతం నగర నగర అధ్యక్షుడిగా ఉంటున్నారు. ఫయాజ్ సేవలను గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం 2019 ఎన్నికల్లో నెల్లూరు నగరం నుంచి సీటు కేటాయించింది. ప్రస్తుతం నెల్లూరు రూరల్‌కు కేటాయించి బరిలో నిలిపింది. ఈ సందర్భంగా షేక్ ఫయాజ్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ఉన్న తనకు రెండుసార్లు పోటీ చేసే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించిందని అన్నారు.

ఆత్మకూరుకు శ్రీధర్‌రెడ్డి



ఆత్మకూరు : పట్టణానికి చెందిన చేవూరు శ్రీధర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నియమితుల య్యారు. 1985 నుంచి కాంగ్రెస్ అనుబంధమైన ఎన్ఎస్‌యూఐ ఆత్మకూరు అధ్యక్షుడిగా పనిచేశారు. 1987 లో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1991లో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. 1999 నుంచి క్రియాశీలకంగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అనుచరుడిగా ఉంటూ వచ్చిన ఆయన తొలిసారి ఆత్మకూరు సర్పంచ్‌గా పోటీ చేశారు. 2019లో ఎన్నికలలో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తర్వాత 2020 నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శిగా, 2022లో ఏఐసీసీ సభ్యుడిగా నియమితులయ్యారు. శ్రీధర్ కొనసాగుతున్నారు. సేవలను గుర్తించి అధిష్ఠానం ప్రస్తుత ఎన్నికల్లో ఆత్మకూరు నుంచే బరిలో దింపింది.

సర్వేపల్లికి చంద్రశేఖర్



మనుబోలు : ముత్తుకూరు మండలం కప్పల దొరువు గ్రామానికి చెందిన పూల చంద్రశేఖర్ సర్వే పల్లి అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నారు. 33 సంవత్స రాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటున్న ఆయన తిరుపతి జిల్లా గూడూరులో నివాసం ఉంటున్నారు. 2005లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో సర్వేపల్లి నుంచే పోటీ చేశారు. సర్వేపల్లి నుంచే మరోమారు ఆయనకు పార్టీ అధిష్ఠానం అవకాశం ఇచ్చింది.

కోవూరుకు నెట్రంబాక



కోవూరు : నియోజకవర్గ అభ్యర్థిగా పోతిరెడ్డి పాళెంకు చెందిన నెట్రంబాక మోహన్ నియమితులయ్యారు. గ్రామం నుంచి నియోజకవర్గ స్థాయి నాయకుడిగా ఎదిగిన మోహన్ పలు కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పార్టీ పిలుపు మేరకు ఆందోళనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోహన్ పేరు ప్రకటనతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు ఆయన్ను అభినందించారు.

కందుకూరుకు సయ్యద్ గౌస్ మొహిద్దీన్



కందుకూరు : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సయ్యద్ గౌస్ మొహిద్దీన్ నియమితులయ్యారు. కందుకూ రుకు చెందిన గౌస్ 30 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. తొలిసారిగా ప్రస్తుతం బరిలో నిలిచారు. ఈ సందర్భంగా కందుకూరులో ఆయన విలేకరులతో మాట్లా డుతూ నియోజకవర్గ చరిత్రలో ముస్లింలకు టికెట్ కేటాయించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. త్వరలో వినూత్నంగా ప్రచారం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

ఉదయగిరి అభ్యర్థిగా సోము



ఉదయగిరి : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సోము అనిల్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. కలిగిరికి చెందిన ఈయన హైదరాబాదులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. సుమారు ఏడాది క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన అనిల్‌కుమార్‌కు ప్రస్తుత ఎన్నికల్లో టికెట్ దక్కడంతో ఆయన అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పోస్టల్ బ్యాలెట్ కీలకం

- చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం
- ఎన్నికల శిక్షణకు గైర్హాజరైతే చర్యలు
- కలెక్టర్ హరినారాయణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 2 : ఎన్నికల ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్ చాలా కీలకమని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఎన్నికల అధికారులతో మంగళవారం సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు హాజరవుతున్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి ఫారం-12 అందచేసి, సంతకం చేసిన తరువాత తిరిగి ఆర్వోలు సేకరించాలని సూచించారు. మే 4. 5తేదీల్లో పీవోలు, ఏపీవోలు, మే 6, 7 తేదీల్లో ఓపీవోలు, 8, 9 తేదీల్లో అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది, 10న డ్రైవర్లు, ఇతర సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించు కునేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మే 3 నుంచి 10 తేదీ మధ్య రెండు విడతల్లో ఇంటి వద్దనే ఓటింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇందుకు ముందుగా 85 ఏళ్లకుపైబడిన వృద్ధులు, దివ్యాంగులను గుర్తించాలన్నారు. మే 11, 12 తేదీల్లో వెబ్ కాస్టింగ్ ప్రక్రియను సాంకేతికంగా పరీక్షించి సరిచూసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వీటికి గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగా గుర్తించాలన్నారు. ఓటర్లను చైతన్యపరిచే స్వీప్ కార్యాక్రమాలను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- సచివాలయాల్లో నగదు అందజేత
- వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే పెన్షన్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 2 : సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం అవుతుంది. ఈనెల 8వ తేదీ వరకు ఇది కొనసాగుతుంది. ఎన్నికల నియమావళి నేపథ్యంలో వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయించొద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఈ నెల సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది అందరూ ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. సచివాలయాల్లోనే పెన్షన్‌దారులకు నగదు అందజేస్తారు. అయితే, వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేస్తారు. అటువంటి వారి ఇళ్లకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వెళ్లి పింఛను అందజేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 16 రకాల సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తుండగా 3.19 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వారిలో 1,73,064 మంది వృద్ధాప్య, 33,489 మంది దివ్యాంగ, 2,070 మంది వైద్య సంబంధ పింఛన్లు పొందుతున్నారు. వీరందరికీ ఇంటి వద్దనే పింఛను నగదు అందచేస్తారు.

ప్రభుత్వ టీచరుపై కేసు నమోదు

ఉలవపాడు, ఏప్రిల్ 2 : రాజకీయ పార్టీ కార్యక్ర మంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడనే కారణంతో సోమ వారం రాత్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కేసు నమో దైంది. ఎస్సై బాజీరెడ్డి కథనం మేరకు.. కరేడు గ్రామా నికి చెందిన కేశవరపు జాలిరెడ్డి గత నెల మార్చి 29న చాగొల్లులో వైసీపీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నాడని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు అందిం ది. దీనిపై స్పందించిన కందుకూరు సబ్ కలెక్టర్ విద్యా ధరి సదరు ఉపాధ్యాయుడిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో విజయను ఆదేశించారు. దీంతో ఎంపీడీవో ఫిర్యాదు మేరకు టీచరు జాలిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వలంటీర్ల మెడపై కత్తి!

- ప్రచారం కోసం బలవంతపు రాజీనామాలు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో సతమతం

నెల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాము తన పిల్లలను తానే తింటుందట. ప్రస్తుతం వలంటర్లు ఎదుర్కొంటున్న ఒత్తిడికి ఈ పోలిక సరిపోతుందని ప్రజలు అనుకొంటున్నారు. సేవ పేరుతో ప్రజల్లో రాజకీయ పట్టు కోసం వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించుకున్న వలంటీర్ల వ్యవస్థను ఇప్పుడు ఆ అవసరాల కోసం ఉద్యోగాలకు రాజీ నామా చేయమంటోంది. 'మిమ్మల్ని నియమించింది మేమే కదా! మా కోసం మీరు రాజీ నామా చేయండి. మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. అప్పుడు మిమ్మల్ని మళ్లీ తీసు కుంటా'మని ఒత్తిడి చేస్తున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు తట్టుకోలేక ఇప్పటికే పలు వురు రాజీనామాలు చేయగా, మిగిలిన వారు రాజీనామా చేస్తే తమ పరిస్థితి ఏమిటో అర్థం కాక లోలోన కుమిలిపోతున్నారు.

● కావలి మున్సిపాలిటీ పరిధిలో 150 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. కావలి రూరల్ మండలంలో 10 మంది, జలదంకి మండలంలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో పెద్ద సంఖ్యలోనే వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలో కూడా ఇదే తరహా రాజీనామాలు చేస్తున్నారు.

● పేదలపైనా ప్రతాపం?

వలంటీర్లుగా పని చేస్తున్న యువతలో అత్యధికులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. వలంటరీ ఉద్యోగం కోసం వీరిలో కొందరు స్థానిక నాయకుల సహాయ సహకారాలు పొందినవారు ఉంటే అత్యధికులు స్వశక్తితో వలంటీర్లుగా నియమితులైన వారే. అయితే ఉద్యోగంలో చేరిన తరువాత వీరంతా పూర్తిగా స్థానిక వైసీపీ నాయకుల చేతుల కిందకు వెళ్లిపోక తప్పని వాతావరణం సృష్టించారు. స్థానిక నాయకుడు దయా దాక్షిణ్యాల మీదే వీరి ఉద్యోగాలు ఆధారపడేంతగా జిల్లా అధికార వ్యవస్థ దిగజారి పోయిం ది. స్థానిక నాయకుడు ఒక ఫోన్ చేస్తే చాలు నిమిషాల్లో వలంటీరు ఉద్యోగం ఊడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో మొత్తం వలంటీర్లు వైసీపీ నాయకుల చేతుల కిందకు వెళ్లిపో యారు. ఇనాళ్లపాటు వారు చెప్పినట్లే నడుచుకున్నారు. ఆ చనువుతో ఇప్పుడు తమ పరిధి లోని వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి ఉద్యోగాలకు రాజీనామాలు చేయించి ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకొంటున్నారు. అదేదో సినిమా డైలాగ్‌లో చెప్పినట్లు సూరిబావ కళ్లలో ఆనందం చూడటానికి అన్నట్లు వైసీపీ అభ్యర్థుల కళ్లలో సంతోషం చూడటానికి తమ పరిధిలోని వలంటీర్లను ఉద్యోగాలకు రాజీనామాలు చేయించి రాజకీయ కూలీలుగా నాయకుల ముందు నిలబెడుతున్నారు. చిన్న కుటుంబాలకు చెందిన వలం టీర్లు స్థానికంగా బలంగా ఉండే వైసీపీ నాయకుల ఒత్తిడిని తట్టుకోలేక ఉద్యోగాలకు రాజీ నామా చేస్తున్నారు. ఒక నాయకుడ్ని చూసి ఇంకో నాయకుడు తమ పరిధిలోని వలం టీర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. పాపం ఈ ఒత్తిడిని తట్టుకోలేక చిరు ఉద్యోగులు విలవిల్లాడిపోతున్నారు. మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం

● ప్రజా ఆశీర్వాద సభలో వేమిరెడ్డి, కాకర్ల



వేమిరెడ్డి, కాకర్లను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

జలదంకి, ఏప్రిల్ 2: మండల ప్రజలు మమ్మల్ని ఆశీర్వదిస్తే మీ మండలాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బ్రాహ్మణక్రాకలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో వారు మాట్లాడుతూ ప్రజలు తమపై చూపించిన ప్రేమానురాగాలకు ముగ్ధులమయ్యామని, ఇదే అభిమానంతో మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వంటేరు మాట్లాడుతూ వైసీపీ ఎంపీ అభ్య ర్థి విజయసాయిరెడ్డి వేమిరెడ్డి కాలిగోటికి కూడా సరిపోడని, వచ్చే ఎన్నికల్లో ఆయన చిత్తుచిత్తుగా ఓటమి పాలవడం కాయమని జోస్యం చెప్పారు. ఈ సభలో కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, బీజేపీ, జనసేన నాయకులు భరత్‌కుమార్, సురేంద్రరెడ్డి, రామ్‌చైతన్య పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న రోడ్‌షో

మండలంలోని బ్రాహ్మణక్రాకలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. కూటమి పార్టీల శ్రేణులు భారీగా తరలిరావడంతో వాహనాలు బారులుతీరాయి. నెల్లూరు ఎంపీ, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య క్రిష్ణారెడ్డి తదితర నేతలు రోడ్‌షోలో పాల్గొని పార్టీల శ్రేణులను ఉత్సాహపరిచారు. అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్ల గుర్రాలపై స్వారీ చేశారు. అడుగడుగునా మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిల స్వగ్రామమైన బ్రాహ్మణక్రాకలో రోడ్డుషో విజయవంతమైంది.



గుర్రాలపై స్వారీ చేస్తున్న వేమిరెడ్డి, కాకర్ల

ఎంత చెప్పినా వినరే!



మనుబోలు : ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్ (వృత్తంలో ఉన్న వ్యక్తి)

మనుబోలు, ఏప్రిల్ 2 : స్థానిక తూర్పు సంఘం గిరిజన కాలనీలో మంగళవారం వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో మనుబోలు-1 సచివాలయ పరిధిలోని ఎండియు ఆపరేటర్ పరిమళ శివ రామకృష్ణ పాల్గొన్నారు. అయితే శివరామకృష్ణ ఉదయం రాజీనామా ఇచ్చి వెళ్ళాడని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు.

● కావలి రూరల్ : ఎన్నికల సంఘం వేటు వేస్తున్నా అధికార పార్టీ సేవలో వలంటీర్లు తరిస్తూనే ఉన్నారు. సోమవారం రాత్రి కావలి మండలం చెంచుగానిపాలెంలో వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నిర్వహించిన ప్రచారంలో వలంటీరు గోపీ పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి జడ్పీటీసీ సభ్యుడు రాఘవులు నృత్యం చేస్తుండగా వలంటీరు తన మొబైల్ ఫొటోలు తీశారు.



కావలిరూరల్ : ఫొటోలు తీస్తున్న వలంటీర్

గ్రావెల్ అక్రమ తరలింపు అడ్డగింత



ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

మనుబోలు, ఏప్రిల్ 2: మండలంలోని అక్కంపేట తిప్ప నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లను టీడీపీ తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సోమవారం రాత్రి అడ్డుకున్నారు. అడ్డుకున్న తమపై గ్రావెల్ వ్యాపారులు దౌర్జన్యం చేశారని, ఈ విషయాన్ని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు తెలియజేశామని రామిరెడ్డి తెలిపారు. పోలీసులు వ్యాపారులకే వత్తాసు పలుకుతున్నారన్నారు. దీనిపై తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పెనమల్లి వెంకటకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు కలికి సుధీర్‌రెడ్డి, బొరెడ్డి శ్రీనువాసులు రెడ్డి, సుమంత్, సునీల్, జనసైనికులు జాకీర్ పాల్గొన్నారు.

చోరీ కేసులో మహిళకు రెండేళ్ల జైలు

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 2 : పనిమనిషే వృద్ధురాలైన యజమానిని బెదిరించి అమె దగ్గర నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేసిందన్న కేసులో నేరం రుజువు కావడంతో పెరివేటి లక్ష్మి అనే మహిళకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నెల్లూరు నగర మొదటి తరగతి రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శారదారెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట ప్రకాష్ నగర్‌లో వృద్ధురాలు రాజరత్నం కుటుంబం నివసిస్తోంది. ఆమె కొడుకు కోడలు దగ్గర్లోని అంజనేయస్వామి గుడికి వెళ్లిన సమయంలో ఇంట్లో పనిచేసే లక్ష్మి ముఖానికి గుడ్డలు కట్టుకుని వృద్ధురాలిని బెదిరించి అమె వద్ద ఉన్న 98 గ్రాముల బంగారు నగలను దోచుకెళ్లింది. గుడి నుంచి ఇంటికి వచ్చిన తర్వాత విషయం తెలుసుకున్న కోడలు గాయత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పనిమనిషి లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయాధికారి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కల్పన వాదించారు.

మహిళ ఫిర్యాదుతో వ్యక్తి అరెస్ట్



కప్పిరి శ్రీనివాసులును అరెస్టు చేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 2: హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి తనను చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్న బజారు పోలీసులు మంగళవారం సంతపేటకు చెందిన కప్పిరి శ్రీనివాసులును అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... 2014లో నగరంలోని ములముడి బస్టాండు సెంటర్‌లో అల్లం నరేంద్ర యాదవ్ హత్య జరిగింది. ఆయన భార్య అనుపమ్మ ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ట్రయల్‌కు వచ్చింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కప్పిరి శ్రీనివాసులు సోమవారం నగరంలోని ఫత్తేఖాన్‌పేట రైతు బజారు వద్ద తనను కలిశాడని, వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే చంపేస్తానని బెదిరించాడని అనుపమ్మ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం కప్పిరి శ్రీనివాసులును అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సమాచారం అందుకున్న ఆయన సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరచడంతో కోర్టు రిమాండ్ విధించింది.

విద్యుత్ తీగ తెగి పడి మంటలు



దగ్ధమవుతున్న కంపచెట్లు

వరికుంటపాడు, ఏప్రిల్ 2: ప్రమాదవశాత్తు విద్యుత్ సర్వీసు వైరు తెగిపడడంతో మంటలు చెలరేగిన సంఘటన మంగళవారం జీ.కొత్తపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. అందులోని సర్వీసు వైరు తెగి కిందపడింది. ఈ ప్రాంతంలోనే కంపచెట్లు ఉండటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అటుగా వెళ్తున్న తినుబండరాల ఆటోపై నిప్పురవ్వలు పడి పైభాగంతో పాటు తినుబండరాలు సైతం కాలిపోయాయి. గమనించిన స్థానికులు హుటాహుటీనా పరుగులు తీసి మంటలను అదుపు చేశారు. సమాచారం అందుకున్న ఉదయగిరి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయగా విద్యుత్ సిబ్బంది సరఫరాను నిలిపివేశారు. ఈ సమయంలో జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఉప్పలపాడు వద్ద లారీ బోల్తా

అనంతసాగరం, ఏప్రిల్ 2: మండలంలోని ఉప్పలపాడు పెన్నాబ్రిడ్జి సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఇసుక లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. నిద్రమత్తులో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. డ్రైవర్ రమణయ్యకు గాయాలయ్యాయి.

వివాహిత ఆత్మహత్య

కావలి రూరల్, ఏప్రిల్ 2: కావలి మండలం చెంచుగానిపాలెంకు చెందిన సూరగాని లలిత (31) మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. లలితకు 16 ఏళ్ల కిందట వెంకటక్రిష్ణయ్యతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. సాఫీగా జరిగిపోతున్న వారి దాపత్య జీవితంలో ఏమి జరిగిందో తెలియదు కానీ మంగళవారం మధ్యాహ్నం భర్త వెంకటక్రిష్ణయ్య ఇంటి బయట నిద్రించి లేచిన తర్వాత ఇంటి తలుపులు తీయబోగా లోపల గడి పెట్టి ఉంది. దీంతో తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లగా భార్య లలిత చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండగా వెంటనే కత్తితో చీరను కట్ చేసి ఆమెను కిందకు దించి ఆమె తల్లిదండ్రులకు తెలిపి చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. డాక్టర్ ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రూరల్ సీఐ కే.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్


	కిలో
బాయిలర్ లైవ్	145
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	282
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 6555
వెండి కిలో ధర	రూ. 78,700
వెండి ఒక గ్రాము	రూ. 80.70

కౌలు రైతుకు నిబంధనాలు

• అందని ఆర్థిక సాయం, రాయితీలు
• కష్టాలతో పంటల సాగు • భూ యజమానులకే లబ్ధి



నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 2 : మాది రైతు ప్రభుత్వమని సీఎం నుంచి గల్లీ లీడర్ వరకు గప్పాలు కొడుతుంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన విధానాలతో కౌలు రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. పంటల సాగుకు ఆర్థిక సాయం అందడం లేదు. ప్రభుత్వ రాయితీలు అసలే అందడం లేదు. భూయజమానులకే లబ్ధి చేకూరుతోంది. దీంతో కొంతమంది కౌలురైతులు సాగుకు దూరమవుతున్నారు.

● జిల్లాలో లక్షమంది కౌలు రైతులు

జిల్లాలో సుమారుగా లక్ష మంది కౌలురైతులున్నారు. వీరిలో సొంతంగా పొలం ఉండి, మరి కొంత పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవారే అధికంగా ఉన్నారు. అసలు భూమిలేనివారు దాదాపు 25 శాతం మంది ఉన్నారు. వీరికి పంటల సాగు ధ్రువీకరణ పత్రం ఆధారంగా రుణాలు, ప్రభుత్వ రాయితీలు ఇతర సౌకర్యాలు అందించాలి. అయితే వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 చట్టం వారికి శాపంగా మారింది. భూయ జమానుల సంతకం లేనిదే వారికి సాగుపత్రాలు ఇవ్వకూడదనేది నిబంధన. దీంతో పలువురు కౌలు రైతులకు పత్రాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. 2022-23లో 17,399 సాగు ధ్రువీకరణ కార్డులు మంజూరు చేయగా, 11,308 మంది రైతులకు రూ.81కోట్లు రుణాలు అందించారు. 2023-24లో 31,573 సాగు ధ్రువీకరణ కార్డులు మంజూరు చేయగా 19,567 మందికి రూ.122.67కోట్లు రుణాలు అందించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

● నిబంధనలతో ఇక్కట్లు

రైతు భరోసా పథకాన్ని ఎలాంటి నిబంధనలు లేకుండా కౌలురైతు లందరికీ వర్తింప చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అది కేవలం ప్రకటనగానే మిగిలింది. ఆధార్, వన్‌బీ అడంగల్‌తోపాటు దరఖాస్తు పత్రంపై భూయజమాని సంతకం పెట్టాలని నిబంధన పెట్టడంతో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. యజమానులు కౌలు చేస్తున్న రైతులకు ఇవ్వకుండా బినామీ పేర్లతో వారి కుటుంబ సభ్యులకు కౌలు కార్డులు ఇచ్చారు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను నిజమైన కౌలురైతులు కోల్పోతున్నారు. అంతేకాక ఎలాంటి భూమి లేని సాగుదారులు భూయజమానికి అంగీకార పత్రంతో రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల లబ్ధి పొందే అవకాశం ఉన్నా యజమానులు ఇవ్వడం లేదు. దీంతో విత్తనాలు, ఎరువులు, రుణాలు, పెట్టుబడి రాయితీ చివరికి ధాన్యం కొనుగోలు సంబంధించి రాయితీలు కూడా దక్కడం లేదు.

● గ్రామసభల ద్వారా కార్డులు అందించాలి

ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందకపోవడంతో విత్తనాలు, ఎరువులకు కౌలు రైతులు అప్పులు చేస్తున్నారు. ఎంతో కష్టపడి పంట చేతికొస్తే తీసుకున్న అప్పులు చెల్లించేందుకు కల్లాల్లోనే ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు. విపత్తుల సమయంలో పంటలు దెబ్బతింటే నష్టపరిహారం అందక మరింత అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారు. గతంలో మాదిరిగా గ్రామసభల ద్వారా కౌలు రైతుల వివరాలను సేకరించి, కౌలు కార్డులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

అప్పిచ్చిన వారికే ధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి

వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాల వల్ల కౌలురైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కౌలు కార్డులు ఇవ్వాలంటే భూయజమానికి సంతకం పెట్టాలి. వారేమో పెట్టరు. పంటల సాగు చేసేందుకు రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పు తీసుకు వస్తున్నారు. సాగు ఖర్చులు పెరిగిపోయాయి. పంట చేతికొచ్చాక అప్పులు తీర్చేందుకు అప్పు ఇచ్చిన వ్యక్తులకే పంట దిగుబడులు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- తుళ్లూరు గోపాల్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి



బొనిగి కోటి (ఫైల్)

చెరువులో దిగి యువకుడి గల్లంతు

మనుబోలు, ఏప్రిల్ 2: మండలంలోని వీరంపల్లి గ్రామంలో ఉన్న అమ్మోరు చెరువులో మంగళవారం బొనిగి కోటి (18) గల్లంతయ్యాడు. గ్రామవాసి బొనిగి శ్రీనువాసులు కుమారుడు కోటి డిగ్రీ చదువుతున్నాడు మంగళవారం బర్రెను మేపేందుకు పొలానికి వెళ్లాడు. సాయంత్రం కాగానే గేదె చెరువులో దిగింది. దాన్ని అదిలిం చేందుకు కోటి చెరువులో దిగాడు. గేదె కొంచెం దూరం పోవడంతో అతను ముందుకు వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. కోటితోపాటు గేదెలు మేపుతున్న జావీద్ గ్రామంలోకి వచ్చి విషయాన్ని చెప్పాడు. దీంతో గ్రామస్థులు చెరువువద్దకు వచ్చారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ అజయ్‌కుమార్ రెస్క్యూ టీమ్‌తో చెరువువద్దకు చేరుకున్నారు. ఎంతసేపు గాలించినా కోటి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ తెలిపారు.



కందుకూరులోని టిడ్కో గృహ సముదాయం

ముసునూరులో చోరీపై పోలీసులకు ఫిర్యాదు

కావలి రూరల్, ఏప్రిల్ 2: కావలి పట్టణం ముసునూరు బాలాజీ వీధిలో జరిగిన చోరీపై బాధితుడు మాదాల సురేష్ మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు... బాలాజీ వీధిలో నివాసం ఉంటున్న సురేష్ గత నెల 25వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలసి హైదరాబాద్‌లోని తన సోదరి ఇంటికి వెళ్లారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపుల తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ చేశారు. ఈ విష యాన్ని సోమవారం ఉదయం అదె ఇంటి పై పోర్షన్‌లో ఉన్న అతని తండ్రి వెంకట్రావు గుర్తిం చి కుమారుడికి సమాచారం ఇచ్చాడు. హైదరాబాద్ నుంచి వచ్చిన బాధితుడు పగల గొట్టిన బీరువాను పరిశీలించగా అందులో ఉంచిన 5 సవర్ల బంగారు వస్తువులతో పాటు వెండి గిన్నె, వెండి గ్లాసు అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 2: మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన స్వర్ణా లక్ష్మయ్య (70) వడదెబ్బకు గురై మంగళవారం మృతిచెందాడు. సోమవారం పని నిమిత్తం ఉదయగిరికి వెళ్లి ఎండకు తిరగడంతో అస్వస్థతకు గురై మృతి చెందినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

• నాణ్యతా ప్రమాణాల మేరకే కొనుగోలు
• పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మీనరసింహారావు



శిక్షణ కార్యక్రమంలో జిల్లా అధికారులు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 2 : జిల్లాలో పండిన ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ లక్ష్మీనరసింహారావు తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై రైతు సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగుచేసిన పంట 70 శాతం చేతికందిందని, రైతులకు బయట మార్కెట్‌లో తక్కువ ధర లభిస్తే, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని చెప్పారు. జిల్లా పౌర సరఫరాల అధికారి రమణ మాట్లాడుతూ సీఎంఆర్‌లో పాలుపంచుకోవడానికి సిద్ధంగా ఉన్న మిల్లులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి గుర్రప్ప, జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి, తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేయండి

● ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్



ఎంపీడీఓకు వినతిప్రత్రం ఇస్తున్న కాకర్ల సురేష్, నాయకులు

వింజమూరు, ఏప్రిల్ 2: దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు ఇంటి వద్దే పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉదయగిరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. మంగళ వారం ఆయన ఈ విషయంపై వింజమూరు ఎంపీడీవో రాజేష్‌బాబును పార్టీ మండల నాయకులతో కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. పింఛన్ల పంపిణీపై వైసీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసమే దురుద్దేశ్యంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక మంది వంటీర్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే ప్రభుత్వం సచివాలయాల్లో పింఛన్ల పింపిణీకి ఆదేశాలు ఇవ్వడం విచారకరం అన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామ కార్యదర్శి సేవలు వినియోగించుకుని లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పింఛన్లను అందించాలని కాకర్ల సురేష్ తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, జనసేన జోన్ కన్వీనర్ పొట్టి వెంకటేశ్వర్లు, చేజర్ల సుబ్బారెడ్డి, కోడూరు నాగిరెడ్డి, గూడా నరసారెడ్డి ఉన్నారు.

చుక్కల దుప్పి మృతి



రైల్వే ప్రాంగణంలో చుక్కల దుప్పి కళేబరం

బిట్రగుంట, ఏప్రిల్ 2: బోగోలు బజారు సమీపంలోని రైల్వే ప్రాంతంలో మంగళవారం చుక్కల దుప్పి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందచేశారు. దీంతో అటవీ శాఖ కావలి సెక్షన్ అధికారి ఆర్.సుమన్ సంఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని పరిశీలించారు. ఈ విషాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి వారి ఆదేశాల మేరకు స్థానిక పశువైద్య శాఖ అధికారులచే పంచనామా నిర్వహించారు. కుడికాలికి గిట్టకు తగిలిన గాయం ఆధారంగా రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. దుప్పి మృతదేహాన్ని అదే ఖననం చేశారు. అటవీప్రాంతంలో మూగజీవులకు తాగునీరు కొరత వలన జనారణ్యంలోకి వస్తున్నాయి. రైల్వే కాలనీలోని శిథిల భవనాల ప్రాంతాల్లో దుప్పిలు, జింకలు సంచరిస్తున్నందున వాటికి అటవీ శాఖ అధికారులు నీటి గుంటలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రంగులు తెచ్చిన తంటా!

• ఎడాపెడా ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు
• ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోని ప్రభుత్వం
• కోడ్ నేపథ్యంలో తొలగిస్తున్న యంత్రాంగం
• నాడు వేసేందుకు.. నేడు తొలగించేందుకు భారీగా ఖర్చు
• ఈ భారమంతా పంచాయతీలపైనే..!

నెల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రచారం తప్ప పని తెలియని వైసీపీ ప్రభుత్వంలో రంగులు చేసిన రాజకీయం అంతా ఇంతా కాదు. ప్రభుత్వ నిర్మాణాలు, ఆస్తులపై ఒక పార్టీ జెండా రంగులు వేయడం చట్ట విరుద్ధమని సాక్షాత్తూ హైకోర్టు తేల్చిచెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు. అంతా మా ఇష్టం.. అడిగేదెవరు.. అన్న రీతిలో ఎక్కడపడితే అక్కడ నీలం రంగులు వేసేశారు. సచివాలయం మొదలు శిలాఫలకాల వరకు రంగులు వేసి రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. అయితే ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ రంగులన్నింటినీ తొలగించాల్సి వచ్చింది. ఇప్పటికే పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో వైసీపీ రంగులను తొలగించి తెల్లసున్నం వేస్తున్నారు. ఇందుకు మళ్లీ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడుతోంది. వైసీపీ ప్రచార పిచ్చి ప్రజాధనాన్ని రంగుల పాలు చేసింది.

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో సుమారు 970 పంచాయతీలు, నెల్లూరు కార్పొరేషన్, కావలి, గూడూరు, ఆత్మకూరు, బుచ్చి, అల్లూరు, నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట మున్సిపాలిటీలు ఉండగా వాటన్నింటిలోనూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రంగుల రాజకీయం మొదలు పెట్టింది. అప్పటి వరకు ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రభుత్వ భవనాలు, ఆస్తులకు తెల్లరంగు వేసి ఉండగా, వాటిని మార్చి వైసీపీ జెండాను పోలిన రంగులను వేయడం ప్రారంభిం చారు. అందులోనూ కొత్తగా నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వాటర్ ట్యాంకులు, ఆఖరుకు శిలాఫలకాలపై కూడా వైసీపీ రంగులను వేశారు. భారీ భవంతులైన టిడ్కో ఇళ్ల సముదాయాలకు కూడా రూ.కోట్లు ఖర్చు చేసి రంగులు మార్చారు. ఈ రంగుల కోసం రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ రంగులన్నీ తొలగించాల్సి వస్తోంది. దీంతో పంచాయతీ, మున్సిపాలిటీల సిబ్బందికి రంగుల తొలగింపు అనేది పెద్ద సమస్యగా మారింది. ఎక్కడపడితే అక్కడ వైసీపీ రంగులు వేయడంతో వాటన్నింటినీ తొలగించి మరో రంగు వేయడం శ్రమగా మారింది. ఆర్థికంగా కూడా ఇది స్థానికలను ఇబ్బంది పెడుతోంది. రంగుల ప్రచార పిచ్చి వైసీపీది అయితే అందుకు అవసరమైన ఖర్చు మాత్రం స్థానిక సంస్థలు భరించాయి. ఈ రంగుల మార్పు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపాయి కూడా విడుదల చేయలేదని అధికారులు చెబుతున్నారు. నాలుగేళ్ల నుంచి తమ చేత రంగులు వేయించారని, కానీ ఏ ఫండ్ నుంచి బిల్లులు పెట్టాల న్నది మాత్రం ఇంత వరకు చెప్పలేదని వాపోతు న్నారు. భవనాలు, ట్యాంకులు, శిలాఫలకాలు.. ఇలా ఇప్పటివరకు వేసిన రంగులకు ఒక్కో పంచాయతీకి రూ.30 వేల నుంచి 2 లక్షల వరకు ఖర్చు అయినట్లు లెక్కలు చెబుతున్నారు. ఎన్నిసార్లు ఈ బిల్లుల గురించి అడిగినా ఉన్నతాధికారులు సమాధానం ఇవ్వకపోవడంతో స్థానిక సంస్థలే ఏదో ఒక పని పేరు పెట్టి పంచాయతీ నుంచి చెల్లింపులు చేశారు. ఇదే సమయంలో ఇప్పుడు ఆ రంగులన్నింటినీ తొలగించాలని ఆదేశం చడంతో మళ్లీ అంతే ఖర్చు అవుతోంది. మరి ఇందుకు నిధులెక్కడ.. అంటే మాత్రం ఉన్నతాధికారుల నుంచి సమాధానం ఉండడం లేదు. ఈ భారం కూడా ఇప్పుడు స్థానిక సంస్థలే మోయాల్సి వస్తోంది. మొత్తంగా వైసీపీ ప్రచార పిచ్చి ఇటు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతోంది.



మనుబోలు : నీలంరంగులో వాటర్ ట్యాంకు

అందరి కోసం ఓటేయండి : వీఎస్‌యూ వీసీ



మాట్లాడుతున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం, ఏప్రిల్ 2 : మన ఓటు మన కోసం కాకుండా అందరి కోసం వేయాలని వీఎస్‌యూ వీసీ సుందర వల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం అమరవీరుల దినోత్సవంలో భాగంగా పరిశుభ్రత, ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకునేలా మనతోటి వారిని, కుటుంబ సభ్యులను చైతన్య పరచాలన్నారు. అనంతరం తహసీల్దార్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఓటర్‌గా నమోదును, ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానాన్ని వివరించారు. అనంతరం అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, డాక్టర్ కే సునీత, డాక్టర్ నీలమణికంఠ, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మస్తానమ్మ హత్య కేసులో మరోవ్యక్తి ?

● ఇప్పటికే పోలీసుల అదుపులో ఆర్ఎంపీ వైద్యుడు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 2 : నెల్లూరు రూరల్లోని నవలాకులతోట విఘ్నేశ్వర నగర్‌లో ఇటీవల జరిగిన నాగూరు మస్తానమ్మ హత్య కేసులో రూరల్ పోలీసులకు ఊహించని మలుపులు కనిపిస్తున్నాయి. మస్తానమ్మను హత్య చేసింది ఆమె పెద్దకుమార్తె సునీతతో సహ జీవనం చేసే చంటి అని మొదటి నుంచి భావిస్తున్న పోలీసులు అతడిని ఏ1గా, సునీతను ఏ2గా కేసులో చేర్చారు. ఆ తర్వాత ఓ ఆర్ఎంపీ వైద్యుడు కూడా ఈ నేరంలో పాల్గొన్నట్లు గుర్తించారు. ఎట్టకేలకు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కానీ ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది. అయితే ఈ హత్యలో మరోవ్యక్తి ప్రమేయం కూడా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఆధారాలు కూడా సేకరించినట్లు సమాచారం. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందన్న కారణంగా మస్తానమ్మను హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇలా.. ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతూ ఆసక్తికరంగా మారింది.

కలిసికట్టుగా పని చేస్తేనే విజయం


మాట్లాడుతున్న కాకర్ల సురేష్


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన వేమిరెడ్డి , కాకర్ల తదితరులు

- ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్
- చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే భవిష్యత్తు
- నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

వింజమూరు,ఏప్రిల్ 2: తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా పనిచేస్తేనే విజయం సాధ్యం అవుతుందని టీడీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్వీ కల్యాణమండపంలో మంగళవారం కొండాపురం, కలిగిరి, వింజమూరు కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ పాతతరం.. కొత్త నీరు కలిసికట్టుగా పని చేస్తేనే టీడీపీ విజయం సాధిస్తుందన్నారు. అలాగే నాయకులు, కార్యకర్తల సలహాలు, సూచనలతో పార్టీని విజయవంతంగా ముందుకు తీసుకుపోతామని చెప్పారు. అంతకుముందు వేమిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే మనకు భవిష్యత్ ఉంటుందని అన్నారు. విబేధాలను వీడి గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికీ తిరిగి ఓటర్లను కలిసి టీడీపీకి ఓటు వేసేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి రంగారావు, జనసేన జోనల్ ఇన్‌చార్జ్ కొంటె వెంకటేశ్వర్లు, మూడు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు ఇవ్వాలి


లింగసముద్రం: వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, జనసేన నేతలు


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కావలి, ఏప్రిల్ 2: సచివాలయ సిబ్బంది ద్వారా సామాజిక పింఛన్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందచేయాలని టీడీపీ నేతలు పేర్కొన్నారు. కావలి పట్టణ, రూరల్ నేతలు మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనాధికారి, ఎమ్పీడీవో కార్యాలయంలో ఎమ్పీడీవోను కలిసి వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్, ఆవుల రామకృష్ణ, కండ్లగుంట మధుబాబు నాయుడు, జ్యోతి బాబూరావు, పోతుగంటి శ్రీకాంత్, దావులూరి దేవకుమార్, ఉప్పాల వెంకట్రావు పాల్గొన్నారు.

కొండాపురం : సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంగళవారం ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం అందచేశారు. దామా మహేశ్వరరావు, యారవ క్రిష్టయ్య, పోలినేని రమేష్, సీహెచ్.వెంకటాద్రి, కుంకు మోహనరావు, రామమోహనరావు, చాగంటి క్రిష్ణ, బద్దిపూడి మాచెర్ల పాల్గొన్నారు.

లింగసముద్రం : లబ్ధిదారులకు ఇంటి వద్దనే త్వరగా పింఛన్ అందజేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నేతలు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ, జనసేన నాయకులు ఏ.చిన కొండయ్య, ఏ.నర్సయ్య, సీహెచ్ బాలకోటయ్య, పీ.బాలకోటయ్య, ఏ.చినసత్యం, జీ.వెంకటేశ్వర్లు, పంగా పోలిరెడ్డి పాల్గొన్నారు.

గుడ్లూరు: సామాజిక పింఛన్‌ను లబ్ధిదారులకు ఇంటివద్దకే సచివాలయ ఉద్యోగులు వెళ్లి అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు స్థానిక మండల కార్యాలయం లో ఎంపీడీవోకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనిగర్ల నాగరాజు. పువ్వాడి వేణుగోపాల్, మేకపోతుల మాలకొండయ్య, చెన్నారెడ్డి మహేష్, దామా వెంకటేశ్వర్లు, చిత్తారి మల్లికార్జున, మద్దసాని కృష్ణ, రమణమ్మ పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: సామాజిక పింఛన్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దనే ఇవ్వాలని కోరుతూ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం ఎంపీడీవో రఫీక్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు వలేటి నరసింహం, చిరంజీవి, మానికొండ కొండయ్య, ఖాజావళి, పార్లపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడకుండా ఇంటి వద్దే సామాజిక పింఛన్లు పంపిణీ చేపట్టాలని టీడీపీ నాయకులు టీడీపీ నాయకులు చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఎంపీడీవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికోడ్ అమల్లోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించిందన్నారు. 1వ తేదీ న లబ్ధిదారు లకు పింఛన్ల నగదు పంపిణీ చేయ కుండా వైసీపీ నాయకులు రాజకీయం చేయ డం సరికా దన్నారు. కార్యక్రమంలో కందుకూరి రత్తయ్య, చల్లా ప్రసాద్, వెంగళరావు, ప్రసాద్, కంభం వెంక టేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి వేసవి సెలవులు

ఉదయగిరి, ఏప్రిల్ 2: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 24నుంచి ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం అవుతాయన్నారు.

ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలి

ఉదయగిరి, ఏప్రిల్ 2: జొన్నపంట సాగు చేసిన రైతులు తమ పేర్లను రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మర్రిపాడు, దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం మండలాల్లో జొన్నల కొనుగోళ్లకు రైతులు తమ పేర్లను ఈ నెల 5వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన మాజీ సర్పంచి వడ్లమాని సుదర్శననాయుడు

సంగం, ఏప్రిల్ 2: మండలంలోని నీలాయపాళెం మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు వడ్లమాని సుదర్శననాయుడు మంగళవారం టీడీపీలో చేరారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు గంగపట్నం శేఖరయ్య, కర్నాటి రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆనం నివాసానికి వెళ్లి టీడీపీ తీర్థపుచ్చుకున్నారు. ఆనం రామనారాయణరెడ్డి సుదర్శన నాయుడికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గిరినాయుడు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వింజమూరు, ఏప్రిల్ 2: మండలంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం మండల విద్యుత్ ఏఈ శ్రీనివాసులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం కేంద్రాల్లో విద్యుత్ సరఫరా జరుగుతుందా లేదా అని పరిశీలించినట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశాలున్నాయని అందుకు సిబ్బందితో కలిసి కేంద్రాలను పరిశీలించామన్నారు. ఆయన లైన్‌మెన్ ఉన్నారు.

సీనియర్ నాయకులతో ఆనం రామనారాయణరెడ్డి భేటీ

చేజర్ల, ఏప్రిల్ 2: టీడీపీ మండల సీనియర్ నాయకులు రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీనరసారెడ్డిలతో మంగళవారం ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామనారాయణరెడ్డిని రావి సోదరులు సన్మానించారు. రానున్న ఎన్నికల్లో మండలంలో పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండల రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ ఈడి గిరినాయుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసులునాయుడు, కొమ్మి తిరపతి నాయుడు, హజరత్తయ్య, రావికృష్టా రెడ్డి, గోపి పాల్గొన్నారు.



వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

అనంతసాగరం, ఏప్రిల్ 2: ఎండ తీవ్రత పెరగడంతో వడదెబ్బ తీవ్రతపై గ్రామీణ ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా అదనపు వైద్యాధికారి, క్షయ నివారణాధికారి షేక్ ఖాదర్‌వలి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో మంగళవారం నిర్వహించిన ప్రతేక సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వ్యవసాయ, ఉపాధిహామీ, భవన నిర్మాణ కార్మికులను అప్రమత్తం చేసి తగు సూచనలివ్వాలని కోరారు. అలాగే ఆసుపత్రిలో ఇటీవల అందుబాటులోకి తెచ్చిన టీబీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి ఓపీ వివరాలు తెలుసుకొన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: వేసవిదృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని గండిపాళెం ప్రాథమి ఆరోగ్య కేంద్ర వైద్యుడు కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లతో మాట్లాడారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తల్లీబిడ్డ, 104 వైద్యసేలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, అంకమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై అవగాహన


సీతారామపురం: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

సీతారామపురం, ఏప్రిల్ 2: మండలంలోని 9సచివాలయాల పరిధిలోని వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మండల కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఉద యం 7 గంటల నుంచి సాయం త్రం 7గంటల వరకు పింఛన్లు అందజేయాలన్నారు. అందుకు ప్రతి సచివాలయంలో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు 5తేదీ నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ డబ్బులు అందజేయాలన్నారు. సచివాలయాల వద్ద తాగు నీటి సౌకర్యం, ఓఆర్ఎస్ పాకెట్లు, ప్రతిఒక్కరు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. గ్రామ వాలంటీర్లు, సర్పంచులు, రాజకీయ నాయకులు ఈ పంపిణీలో పాల్గొనకూడదన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి, ఏవో వెంకటేశ్వర్లు, పంచా యతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయండి


విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 2: ఈ నెల 6వ తేదీ నుంచి జరగనున్న సమ్మేటివ్-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన శకునాలపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల పఠన, అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీవీ రత్నం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా నీటితొట్లు


అనంతసాగరంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

ఆత్మకూరు: నియోజకవర్గంలో రోజురోజుకు ఎండలు పెరడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువులు, కుంటల్లో కూడా చుక్కనీరు లేక ఎడారిని తలపిస్తున్నాయి. ఈ క్రమంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం కొన్ని గ్రామాల్లో నీటి తొట్లెలను నిర్మించింది. అధికారుల వీటి పర్యవేక్షణను పట్టించుకోక పోవడంతో అలంకార ప్రాయంగా ఉన్నాయి. ఆత్మకూరు మండలంలో కనుపూరుపల్లి, చెర్లోయడవల్లిలో నిర్మించిన నీటి తొట్లెలు వినియోగంలో ఉన్నాయి. అనంతసాగరం మండలంలో పశుసంపద ఎక్కువగా ఉంది. అధికార యంత్రాంగం దృష్టి సారించి పశువులకు దాహార్తిని తీర్చే నీటితొట్లెల నిర్మాణాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సంగం మండలంలోని తరుణవాయితో పాటు పలు గ్రామాల్లోని నీటి తొట్లెలు నిరుపయోగంగా ఉన్నా యి. ఏఎస్‌పేట మండలంలో 50కిపైగా నీటితొట్లెలను ఏర్పాటు చేశారు. కాని నీటితొట్లెల్లో నీటిని నింపకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్ని గ్రామాల్లో నీటి తొట్లెలు శిథిలావస్థకు చేరాయి.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

టీఆర్‌ఆర్‌లో అసెస్‌మెంట్ యాప్ టెస్ట్‌రన్

- ఉన్నత విద్యాశాఖ కమిషనర్ భాస్కర్ సందర్శన


యాప్ టెస్ట్‌రన్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్

కందుకూరు, ఏప్రిల్ 2: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ రూపొందించిన అసెస్‌మెంట్ యాప్‌కు సంబంధించి స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కమిషనర్ పోలా భాస్కర్ టెస్ట్‌రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెస్‌మెంట్ యాప్ వల్ల కళాశాలల పనితీరు, విధివిధానాలు ఉన్నతస్థాయిలో సులభంగా తెలిసిపోతుందన్నారు. ఇటీవలే న్యాక్ ఏ ప్లస్ సాధించిన కళాశాలను సందర్శించాలన్న ఆలోచనతో టెస్ట్‌రన్‌కు ఈ కళాశాలను ఎంచుకున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాలలో అభివృద్ధి చేసిన హరితవనం, అజోలాపాండ్, వర్మీ కంపోస్టు యూనిట్లను, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ తరఫున వేస్ట్ పేపర్లతో కళాత్మకంగా తయారుచేసిన హస్తకళాఖండాలను పరిశీలించిన ఆయన విద్యార్థినీ విద్యార్థులను, ఉమెన్‌సెల్ కో ఆర్డినేటర్ షేక్ షానాజ్‌బేగంను అభినందించారు. కళాశాలలో ఉన్న లేబరేటరీలు, కంప్యూటర్ లేబరేటరీ, ఇతర సదుపాయాలను ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆయనకు వివరించారు. కళాశాలలో తోటలపెంపకానికి వీలుగా అదనపు బోర్‌వెల్, డ్రిప్‌సిస్టమ్, స్ప్రింక్లర్ సిస్టమ్ అందజేసిన పూర్వవిద్యార్థి శంకర్‌ప్రసాద్ చేతులమీదుగా పోలా భాస్కర్ ఆ సిస్టమ్‌ను ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీవో డాక్టరు తులసి, డాక్టరు ఏ.కవిత, జిల్లాలోని ఎస్‌ఆర్‌సీ, ఒంగోలు పరిధిలోని వివిధ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కంప్యూటర్స్ సైన్స్ విభాగం అధ్యాపకులు, టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీని పరిశీలించిన ఆర్‌వో


ముసునూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఆర్డీవో శీనానాయక్

కావలి, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నగదు, మద్యం అక్రమ రవాణా నిరోధించటంలో భాగంగా ముసునూరు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీని మంగళవారం సాయంత్రం కావలి రిటర్నింగ్ అధికారైన ఆర్డీవో శీనానాయక్ పరిశీలించారు. జనరల్ తనిఖీలలో భాగంగా చేపట్టిన తనిఖీల్లో ఆర్డీవోతో పాటు కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి మధ్యాహ్నం నుంచి సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ

లింగసముద్రం, ఏప్రిల్ 2 : మండలంలోని 13 సచివాలయాల వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపీడీవో యు శేషుబాబు మంగళవారం చెప్పారు. సచివాలయాలు ఉన్న గ్రామాల్లో లబ్ధిదారులు నేరుగా సచివాలయం వద్దకు వచ్చి పింఛను తీసుకోవచ్చని చెప్పారు. వృద్ధులు, ఆరోగ్యం సరిగా లేని వారు, మంచంలో ఉన్న వారికి సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తారన్నారు. అలాగే సచివాలయం పరిధిలోని దూరంగా ఉన్న గ్రామాల లబ్ధిదారులకు కూడా సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛను అందజేస్తారని చెప్పారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు తీసుకొని రావాలని తెలిపారు.

హరిత విద్యుత్‌పై అవగాహన

కావలి, ఏప్రిల్ 2: జైభారత్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే కావలిలో ప్రతి ఇంటికి ఉచిత హరిత విద్యుత్‌ను అందిస్తామని ప్రముఖ శాస్త్రవేత్త శ్రీనివాస్ బాస్కర్ చాగంటి, జైభారత్ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పసాని నరేంద్రలు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం జైభారత్ అభ్యర్థితో కలిసి హరిత విద్యుత్ తయారు చేసే విధానం, దానిని ఉచితంగా ప్రజలకు ఎలా అందించవచ్చనే దానిపై వివరించారు. నరేంద్ర మాట్లాడుతూ ప్రజాసేవచేయాలనే లక్ష్యంతో జేడీ లక్ష్మీనారాయణ జైభారత్ పార్టీని స్థాపించారన్నారు. ఆయన ఆశయం మేరకు పని చేస్తామన్నారు.

అనారోగ్యంతో ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి మృతి


బ్రహ్మచారి(ఫైల్)

కలిగిరి, ఏప్రిల్ 2: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం బ్రహ్మచారి అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. బ్రహ్మచారి గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్సపొందుతున్నట్లు కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు కార్యాలయ సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

బిట్రగుంట, ఏప్రిల్ 2: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యాలయ ఆవరణంలో కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వేసవి ఎండలు పెరుగుతుండటం వలన అనారోగ్యానికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ నిత్యప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బందితో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచు సుజాతమ్మకు ఎంపీపీ పరామర్శ

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 2: దగదర్తి మండలం మనుబోలుపాడు సర్పంచు కల్వకుర్తి సుజాతమ్మ అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా ఎంపీపీ తాళ్ళూరి వెంకటకృష్ణప్రసాద్ నాయుడు మంగళవారం పరామర్శించారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

సంగం, ఏప్రిల్ 2: వెంగారెడ్డిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఐసీడీఎస్ పీడీ హేనాసుజన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రికార్డులో నమోదు చేసిన వివరాల మేరకు చిన్నారుల బరువును పరిశీలించారు. ఆమె వెంట సీడీపీవో సునీత, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త సుగుణ, ఆయా లక్ష్మీ, తదితరులు ఉన్నారు.

కావలిలో తెలుగుదేశం నాయకుల ప్రచారం


టీడీపీ అభ్యర్థి కావ్యను స్వాగతిస్తున్న ముస్లింలు

కావలి, ఏప్రిల్ 2: కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పట్టణంలోని వెంగళరావునగర్ 19వ వార్డులో వార్డు ఇన్‌చార్జి యేగూరి చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి మన్నవ రవిచంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆ వార్డులో ఉన్న రెండు మసీదులలో ముస్లింలతో కలసి ప్రార్థనలు చేశారు. అనంతరం వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం సాగించారు. ఈ వార్డులో ముస్లింలు ఎక్కువగా ఉన్నందున కమ్యూనిటీ హాల్, ఉర్దూ పాఠశాల, 10 ఎకరాలలో ముస్లిం శ్మశాన వాటిక నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. 10 ఏళ్ల కావలి ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్‌కుమార్ రెడ్డి దొరికిన కాడికి దోచుకోవటం దాచుకోవటం తప్ప ఈ ప్రాంతానికి ఏమి చేశారని ప్రశ్నించారు. దోచుకున్న డబ్బుతో మభ్యపెట్టడానికి మళ్లీ మీ ముందుకు వస్తున్నాడని, ఆయనకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు ఇన్‌చార్జి శానం హరి, పలువురు ముస్లింలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 2: పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని విజయ్‌నగర్ కాలనీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆపార్టీకి రాజీనామా చేసి జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతు తెలుపుతూ ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమంలో వారికి ఇంటూరి నాగేశ్వరరావు జనసేన, టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముప్పవరపు వేణు, గోకరాజు మదన్‌కుమార్, కొణిదల సిద్ధయ్య, శిగా తిరుపాలు, ఆవుల రవికుమార్, చదలవాడ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

దారకానిపాడు ఎస్సీ కాలనీ వాసులు...

గుడ్లూరు : మండలంలోని దారకానిపాడు ఎస్సీ కాలనీకి చెందిన పలువురు కాలనీ వాసులు వైసీపీని వీడి, తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగదేశం నాయకులు కాకుమాని కోటేశ్వరరావు, సోమినేని హరినాథ్, కాకుమాని వెంకటేశ్వర్లు, అల్లం మస్తానయ్య, ఘట్టమనేని మల్లికార్జున, సోమినేని సుధాకర్, గడ్డం అంకయ్య, కుర్రా కోటేశ్వరరావు, తన్నీరు మాల్యాద్రి, తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో టీడీపీ ముమ్మర ప్రచారం


ప్రచారంలో సందీప్‌రెడ్డి, బినీత్‌రెడ్డి, గిరిధర్

అల్లూరు, ఏప్రిల్ 2 : అల్లూరులో మంగళవారం టీడీపీ, బీజేపీ, జనసేన నెల్లూరు ఎంపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడి కుమారుడు వేమిరెడ్డి సందీప్‌రెడ్డి, కావలి కూటమి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులరెడ్డి, కృష్ణ చైతన్య, అరగల రమణయ్య, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఊటు అశోక్‌రెడ్డి, సామంతుల పరంధామ రెడ్డి, పెనుమల్లి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి అల్లూరు పట్టణంలోని తూర్పు వీధి, గోగులపల్లి రోడ్డు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఏలూరు సుధాకర్‌రెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, కారుమంచి కార్తీక్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీవీ కండ్రిగలో ఇంటింటి ప్రచారం


ఎస్‌జీవి కండ్రిగలో ప్రచారం చేస్తున్న నేతలు

బిట్రగుంట, ఏప్రిల్ 2: బోగోలు మండలం ఎస్‌జీవీ కండ్రిగ పంచాయతీలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సోదరుడు దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతు కరపత్రాలు పంపిణీ చేశారు. రాత్రి కప్పరాళ్ల తిప్పలోని టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, తిరుపాల్‌రెడ్డి, హజరత్‌రెడ్డి యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, శీను, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

- దగదర్తి మండలం లింగాలపాడులో టీడీపీ కావలి నియోజకవర్గ నేత మాలేపాటి సుబ్బానాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రగతి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై అసత్య ఆరోపణలు తగదు

ఆత్మకూరు, ఏప్రిల్ 2: పింఛన్ల పంపిణీలో తెలుగుదేశం అడ్డుపడుతుందని వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం తగదని టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకట్వేర్లునాయుడు అన్నారు. ఈ విషయంపై మంగళవారం వారు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వలంటీర్ల సేవలపై ఈసీ విధించిన ఆంక్షలను వైసీపీ తన ఎన్నికల ప్రచారానికి అస్త్రంగా ప్రయోగిస్తుందని ఆరోపించారు. మరోవైపు వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించడం వల్ల పింఛనుదారులతో సానుభూతి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఈసీకి ఫిర్యాదులు అందడం, హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో కేంద్ర ఎన్నికల సంఘం పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 2: మండలంలోని 12 సచివాలయాల పరిధిలో 123మంది సిబ్బందితో 4,987 మంది లబ్ధిదారులకు బుధవారం మధ్యాహ్నం నుంచి సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా సచివాలయాల వద్ద టెంట్లు, తాగునీటి ఏర్పాట్లు చేస్తామని, వైద్యఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

అర్హులందరికీ...

వరికుంటపాడు: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని మంగళవారం ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలిపారు. సచివాలయాల్లో 6వ తేదీ వరకు పంపిణీ చేస్తామన్నారు. అందుకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తామన్నారు. దివ్యాంగులు, రోగులకు మాత్రం ఇంటివద్దకే వెళ్లి పంపిణీ చస్తామన్నారు.

ఐదులోగా అవ్వాతాతలకు పింఛను ఇవ్వాలి : టీడీపీ


పొదలకూరు : ఎంపీడీవోకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


వెంకటాచలం : ఎంపీడీవో ముజీబున్నీసాకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, జనసేన నాయకులు


మనుబోలు : ఇన్‌చార్జి ఎంపీడీవోకి వినతిపత్రం అందిస్తున్న కూటమి నాయకులు

పొదలకూరు, ఏప్రిల్ 2: పేదవారి పింఛన్లు ఆపి వైసీపీ లబ్ధి పొందాలని చూస్తున్నదని, శుక్రవారం లోపు ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడులు కోరారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్‌ఏ మహమ్మద్ రఫీకి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ ఆగిపోతే చంద్రబాబే బాధ్యుడని సీఎం జగన్ ఇప్పటికీ అంటున్నారు. ఏ ఒక్క అవ్వాతాతకు ఇబ్బంది జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, పల్లారపు కృష్ణయాదవ్, బోగోలు భాస్కర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం : వృద్ధులకు వారి ఇళ్ల వద్దనే పింఛన్లు అందించాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ కోరారు. మంగళవారం ఎంపీడీవో ముజీబున్నీసాను టీడీపీ, జనసేన నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో కనీసం 12 మంది ఉద్యోగులు ఉన్నారని, వారి ద్వారా అవ్వాతాతలకు సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వల్లూరు రమేష్‌నాయుడు, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మనుబోలు : సామాజిక పింఛన్లను బుధవారం నుంచి అధికారులు ఇళ్లవద్దకే వెళ్లి ఇవ్వాలంటూ ఎన్‌డీఏ కూటమిలోని మూడు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. వేసవిలో వృద్ధులను, దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేయకుండా సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులను కలుపుకుని పింఛన్‌దారులకు ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, పచ్చిపాల రామిరెడ్డి, బీజేపీ నేత పీవీ కృష్ణారెడ్డి, జనసేన నాయకులు కోటేశ్వరరెడ్డి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

● పింఛన్ల పంపిణీపై రాజకీయం

తోటపల్లిగూడూరు : పింఛన్ల పంపిణీపై వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని పంచాయతీ చాంబర్స్ రాష్ట్ర కార్యదర్శి గోపిరెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని వీలుకానిపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పింఛన్లు పంపిణీని కూడా వైసీపీ రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదన్నారు. సచివాలయం ఉద్యోగులకు పింఛన్ల పని అప్పగిస్తే రెండు గంటల్లో పూర్తవుతుందన్నారు.

అధికారం కోసం కాదు.. సేవ చేయడానికే రాజకీయాల్లోకి..

విడవలూరు, ఏప్రిల్ 2: రాజకీయాల్లోకి తాను అధికారం కోసం రాలేదని, ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని కోవూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వీరారెడ్డిపాళెం, వరిణి, దండిగుంట గ్రామాల్లో మంగళవారం ఆమె ప్రచారం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, తూశ్లూరు మాధవ్, కుడుముల మల్లికార్జున, రాజన్న తదితరులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పలు గ్రామాల్లో అనేక సేవాకార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లోని సమస్యలను టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా వీరారెడ్డిపాళెం గిరిజన కాలనీలోని సుమారు 100 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, సత్యవోలు సత్యంరెడ్డి, పొన్నవోలు పురందర్‌రెడ్డి, ఎస్‌కే రఫీ, జనసేన నాయకులు కమతం శ్రీనాథ్, బీజేపీ నేత కనుపర్తి నాగేంద్ర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

● విడవలూరు మండలంలో ప్రశాంతిరెడ్డి ప్రచారం


విడవలూరు : వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

● కోవూరును అవినీతిరహితంగా మారుస్తా..

కొడవలూరు : కోవూరు నియోజకవర్గాన్ని అవినీతిరహిత నియోజకవర్గంగా మార్చుతానని టీడీపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో గండవరంలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఉదయకళేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో కోవూరు అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. అనంతరం గండవరంలో పలు అభివృద్ధి పనులకు హామీ ఇచ్చారు. కాగా కొత్తవంగల్లు, తాటేకులదిన్నె గ్రామాల నుంచి సుమారు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జనసేన గునుకుల కిషోర్, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, జి.శేఖర్‌రెడ్డి, ఇరువూరి శ్రీధర్‌రెడ్డి, మందపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అల్లం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇది ఉల్లంఘన కాదా ?


శిలాఫలకంపై ఉన్న ముఖ్యమంత్రి, మంత్రి ఫొటోలు

మనుబోలు, ఏప్రిల్ 2: అడుగడుగునా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇటీవల పిడూరులో బియ్యం వాహనాలపై సీఎం చిత్రాలు ఉండడంతో ప్రచారానికి వచ్చిన టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి ప్రశ్నించారు. కాగా గతంలో మనుబోలు బీసీ కాలనీలో మురుగుకాలువల ప్రారంభోత్సవానికి శిలాఫలకం ఏర్పాటుచేశారు. దానిపై సీఎం జగన్, మంత్రి కాకాణి ఫొటోలు ఉన్నాయి. నియామావళి ప్రకారం ఫొటోలు కనిపించకుండా పెయింట్ కాని, ముసుగు కాని వేయాల్సి ఉండగా ఆ విషయాన్ని అధికారులు పట్టించుకోలేదు.

ప్రశాంతిరెడ్డి గెలుపునకు కృషి చేయాలి

కొడవలూరు : కోవూరు టీడీపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు నాపా వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కమ్మపాళెంలో మంగళవారం గ్రామ కార్యకర్తలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరులో ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు జీవీఎన్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

సంగం, ఏప్రిల్ 2: వెంగారెడ్డిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఐసీడీఎస్ పీడీ హేనా సుజన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రికార్డులో నమోదు చేసిన వివరాల మేరకు చిన్నారుల బరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రానికి నూరుశాతం చిన్నారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఆమె వెంట సీడీపీవో సునీత, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త సుగుణ, ఆయా లక్ష్మి తదితరులు ఉన్నారు.

సర్వేపల్లిలో కాకాణి సీన్ అయిపోయింది.. : సోమిరెడ్డి

పొదలకూరు, ఏప్రిల్ 2: సర్వేపల్లిలో కాకాణి సీన్ అయిపోయిందని, రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పంచాయతీ బస్టాండు, శివాలయం వీధిలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై ఎన్నికల కమిషన్ కొరడా ఝులిపించిందని, అందులో భాగంగా జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డిపై వేటుపడిందని అన్నారు. జిల్లా కలెక్టర్ కంటే ఓ బిల్‌కలెక్టర్ మేలని తెలిపారు. ఈ సందర్భంగా శివాలయం వీధికి చెందిన 25 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి సోమిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, కోడూరు భాస్కర్‌రెడ్డి, ఆదాల సుగుణమ్మ, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు కరపత్రాలు అందిస్తున్న సోమిరెడ్డి

● యాచవరంలో టీడీపీ ప్రచారం

మనుబోలు : వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి తన మామ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలంటూ ఆయన కోడలు శృతిరెడ్డి కోరారు. మండలంలో యాచవరంలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, గుంజి వెంకటేశ్వర్లు, సతీష్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జలయజ్ఞం కాదు.. ధనయజ్ఞం : లక్ష్మీ సాయిప్రియ

సైదాపురం, ఏప్రిల్ 2: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జలయజ్ఞంను ధనయజ్ఞంగా మార్చి కోట్ల రూపాయలు దోచుకున్నారని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ఆరోపించారు. మంగళవారం సైదాపురం పంచాయతీ పరిధిలోని కమ్మవారిపల్లి, సైదాపురంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి చేసిందిలేదన్నారు. చంద్రబాబునాయుడు మహిళలకు ప్రవేశపెట్టిన సూపర్-6 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు త్వరితగతిన పింఛన్లు అందజేయాలని ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లక్ష్మీసాయిప్రియకు టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ మండలాధ్యక్షుడు మోహన్‌కృష్ణారెడ్డి, కొండూరు సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీసాయిప్రియ

నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీ

కోవూరు, ఏప్రిల్2: ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా జాతీయరహదారి పక్కన పోతిరెడ్డిపాళెం సమీపంలో నెల్లూరు పార్లమెంటు వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఫ్లెక్సీని ఆ పార్టీ నాయకులు మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని పలువురు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లనున్నారు.



దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్2: కొంతకాలంగా రఫీ, సిరాజ్ అనే వారు తమపై దౌర్జన్యం చేస్తూ, భయాందోళనకు గురిచేస్తున్నారంటూ పలువురు మైనార్టీ మహిళలు, గిరిజనులు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా వారిద్దరూ రాత్రిళ్లు ఇళ్లమీదకు వస్తున్నారని తెలిపారు. తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు. రెండురోజులుగా కాలనీలోని దర్గాలో కుల,మతాలకతీతంగా నిర్వహించిన గంధోత్సవానికి తమను రానీయకుండా అడ్డుకున్నారని వారు వాపోయారు. ఫిర్యాదు మేరకు విచారించి న్యాయం చేస్తామని సీఐ, వైమారావు తెలిపారు.


పోలీసుస్టేషన్ వద్ద గుమికూడిన గిరిజనులు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ఇంటికెళ్లి పింఛన్ ఇవ్వాల్సిందే!

● నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 2 : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వలంటీర్లను నిలుపుదల చేసిన నేపథ్యంలో సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లే ఇవ్వాలని మాజీ మంత్రి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని 53, 54 డివిజన్లకు సంబంధించి అష్రాఫ్ అలీ మజీద్, ఇబ్రహీం మసీదులో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందుల్లో ఆయన పాల్గొన్నారు. వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ఎన్నికల్లో లబ్ధికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నగర అధ్యక్షుడు మామిడాల మధు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో నారాయణ, అజీజ్ తదితరులు

● కాగా, నారాయణ మంగళవారం 39వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. నెల్లూరు అభివృద్ధే ప్రధాన ఎజెండాగా తాను పనిచేస్తానని చెప్పారు. అనంతరం 9వ డివిజన్‌లో కుమార్తె సింధూరతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే నగరంలోని పెండింగ్ పనులన్నీ పూర్తి చేయడంతోపాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే 4వ డివిజన్‌లో పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


ఎన్నికల ప్రచారంలో కుమార్తె సింధూరతో నారాయణ

దివ్యాంగులకు ఇంటికెళ్లి పింఛన్ ఇవ్వండి

● అధికారులకు టీడీపీ వినతి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 2 : గ్రామీణ ప్రాంతాల్లో దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ ఇంటికి తీసుకెళ్లి ఇవ్వాలని టీడీపీ నాయకులు నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్‌ను కోరారు. మంగళవారం ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. పింఛన్ పంపిణీ బాధ్యత నుంచి ఎన్నికల సంఘం వలంటీర్లను తొలగించినందున, ఇతర ప్రభుత్వ సిబ్బందితో బుధవారం నుంచి పంపిణీ జరగనుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రత్యేక అవసరాలున్న వారికి ఇంటికి తీసుకెళ్లి పింఛను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, జలదంకి సుధాకర్, సారంగం గున్నయ్య, మలినేని వేణునాయుడు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, ఇదే అంశంపై పలువురు కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్‌కు కార్పొరేషన్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మురహరి, బద్దేపూడి నరసింహగిరి, నాయకులు రాజానాయుడు, మదన్‌కుమార్‌రెడ్డి, హజరత్‌నాయుడు పాల్గొన్నారు.


ఎంపీడీవోకి వినతి పత్రం అందచేస్తున్న టీడీపీ నాయకులు

దొంగ ఓట్లతో గెలిచిన చంద్రశేఖర్‌రెడ్డా.. మాట్లాడేది?

● డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్


మాట్లాడుతున్న రూప్‌కుమార్

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 2 : దొంగ ఓట్లతో ఎమ్మెల్సీగా గెలిచిన చంద్రశేఖర్‌రెడ్డీ.. నువ్వా నారాయణ గురించి మాట్లాడేది?, రాజకీయాల్లో ఏడాది అనుభవం ఉన్న నీస్థాయికి నారాయణ సమాధానం చెపాల్సిన అవసరం లేదని దమ్ముంటే తనతో చర్చకు రావాలంటూ టీడీపీ నాయకుడు, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ సవాల్ విసిరారు. జేమ్స్ గార్డెన్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను పేదవాడినంటూ విజయసాయిరెడ్డి ఎన్నికల ప్రచారంలో చెబుతున్నారని, అయితే ఆయన ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేందుకు స్పెషల్ ఫ్లైట్లు ఎలా ఉపయోగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పేదోడికి శంషాబాద్ వద్ద 10 ఎకరాల పొలం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఆస్మా, మైనుద్దీన్, దేవరకొండ సుజాత అశోక్, గోగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? : కోటంరెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 2 : నగరంలో నారాయణ చేసిన అభివృద్ధిని నిరూపించుకోవాలనడం ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి రాజకీయ అవివేకానికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో నారాయణ ఎన్ని పార్కులు కట్టించారో నీకు తెలుసా.. అని ప్రశ్నించారు. నారాయణ చేసిన అభివృద్ధిపై గాంధీబొమ్మ కూడలిలో చర్చకు రావాలని చంద్రశేఖర్‌రెడ్డికి సవాల్ విసిరారు.

శ్రీనివాసులు సేవలు మరవలేనివి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి యామిని

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 1 : నెల్లూరు 5వ అదనపు జిల్లా కోర్టు సూపరింటెండెంట్ పత్తిపాటి శ్రీనివాసులు సేవలు మరువలేనివని జిల్లా ప్రధాన న్యాయాధికారి సీ యామిని కొనియాడారు. శ్రీనివాసులు ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘం అధ్వర్యంలో మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యామిని మాట్లాడుతూ శ్రీనివాసులు సేవలను మిగిలిన ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పరిపాలనాధికారి ప్రసాద్, సెంట్రల్ నాజర్ నాగేశ్వర రావు, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కే నరసింహా రావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై సురేష్, పీవీ నారాయణరెడ్డి, శివకుమార్, అర్గనైజింగ్ సెక్రటరీలు బీ సురేంద్ర బాబు యదవ్, బీ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాసులు వీడ్కోలు సభలో న్యాయాధికారి తదితరులు


మైమరిపించిన వాద్య కచేరీ

● కొనసాగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 2 : నగరంలోని పురమందిరంలో త్యాగరాజ స్మరణోత్సవ సంగీత వేడుకలు వీనుల విందుగా సాగుతున్నాయి. మంగళవారం శ్రీరామచంద్రుడికి వేణుగోపాలస్వామి అలంకారం భక్తులను ఆకట్టుకుంది. రాత్రి జరిగిన వేణువు, నాదస్వర వాద్య కచేరీ శ్రోతలను మైమరపింపజేసింది. చెన్నైకి చెందిన డాక్టర్ విజయగోపాల్, మైలై కార్తికేయన్ బృందం వేణువు, నాదస్వరంతో త్యాగరాజ కృతులను హృద్యంగా వినిపించింది. రామ కథా సుధ కీర్తనతో మధ్యమావతి రాగంలో స్వరార్చన చేసి రసజ్ఞులను రంజింపజేశారు.

ఉదయం హరికథా గానంలో భీష్మ విజయాన్ని సీహెచ్ భవానీబాయి భాగవతారిణి గానం చేశారు. భక్త మీరాబాయి హరికథను కే శారద భాగవతారిణి గానం చేశారు. సాయంత్రం స్థానిక సంగీత కళాకారులు త్యాగరాజ స్వామి సంకీర్తనలను ఆలపించి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమాలను భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ పర్యవేక్షించింది.


వేణుగోపాలుడిగా శ్రీరాముడు


వేణువు, నాదస్వర కచేరీ చేస్తున్న సంగీత విద్వాంసులు విజయగోపాల్, కార్తికేయన్

కేజీ రూ.100కు చేరిన 'రూప్‌చంద్'

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 2 : రైతులు సాగు చేస్తున్న రూప్‌చంద్ చేపల ధర కేజీ రూ.100కు చేరినట్లు సాగుదారులు తెలిపారు. జిల్లాలో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి కైకలూరు, ఆకివీడు మార్కెట్ ధరల కంటే తగ్గించి కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో సాగుదారులు నష్టపోతున్న వైనాన్ని ఆంధ్రజ్యోతి ఇటీవల ప్రత్యేక కథనం ద్వారా వెలుగులోకి తెచ్చింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సాగుదారులు ఒక్కతాటిపైకి రావడంతో దిగొచ్చిన వ్యాపారులు మంగళవారం నుంచి కేజీ రూ.100కు కొనుగోలు చేసేందుకు సిద్ధపడ్డారని రైతులు పేర్కొన్నారు. ఇదే రేటు కొనసాగితే సాగుదారులకు కాస్త ఊరట లభిస్తుందని చెప్పారు.

ప్రభుత్వ పెన్షనర్లకి ఆదాయ పన్ను రద్దు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 2 : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఆదాయపన్ను రాయితీ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, భారతసేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసిం, భారత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు, విశ్రాంత ఎస్పీ డాక్టర్ కాకుమాని రాజశిఖామణి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో గత ఐదేళ్లుగా ఒకటో తేదీన పింఛను తీసుకున్న దాఖలాలులేవన్నారు. వచ్చే ప్రభుత్వమైనా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను ఇచ్చేలా అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో ప్రకటించాలని కోరారు. ఇన్సూరెన్స్‌కార్డులపై ఉచిత వైద్యం కల్పిస్తామని, డీఏ, పీఆర్‌సీ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వాలన్నారు.

టీఆర్‌ఆర్‌లో అసెస్‌మెంట్ యాప్ టెస్ట్‌రన్


● ఉన్నత విద్యాశాఖ కమిషనర్ భాస్కర్


యాప్ టెస్ట్‌రన్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్

కందుకూరు, ఏప్రిల్ 2: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ రూపొందించిన అసెస్‌మెంట్ యాప్‌కు సంబంధించి స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కమిషనర్ పోలా భాస్కర్ టెస్ట్‌రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెస్‌మెంట్ యాప్ వల్ల కళాశాలల పనితీరు, విధివిధానాలు ఉన్నతస్థాయిలో సులభంగా తెలిసిపోతుందన్నారు. ఇటీవలే న్యాక్ ఏ ప్లస్ సాధించిన కళాశాలను సందర్శించాలన్న ఆలోచనతో టెస్ట్‌రన్‌కు ఈ కళాశాలను ఎంచుకున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాలలో అభివృద్ధి చేసిన హరితవనం, అజోలాపాండ్, వర్మీ కంపోస్టు యూనిట్లను, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ తరపున వేస్ట్ పేపర్లతో కళాత్మకంగా తయారుచేసిన హస్త కళాఖండాలను పరిశీలించిన ఆయన విద్యార్థినీ విద్యార్థులను, ఉమెన్‌సెల్ కో ఆర్డినేటర్ షేక్ షానాజ్‌బేగంను అభినందించారు. కళాశాలలో ఉన్న లేబరేటరీలు, కంప్యూటర్ లేబరేటరీ, ఇతర సదుపాయాలను ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆయనకు వివరించారు. కళాశాలలో తోటలపెంపకానికి వీలుగా అదనపు బోర్‌వెల్, డ్రిప్‌సిస్టమ్, స్ప్రింక్లర్ సిస్టమ్ అందజేసిన పూర్వవిద్యార్థి శంకర్‌ప్రసాద్ చేతులమీదుగా పోలా భాస్కర్ ఆ సిస్టమ్‌ను ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీవో డాక్టరు తులసి, డాక్టరు ఏ.కవిత, జిల్లాలోని ఎస్ఆర్‌సీ, ఒంగోలు పరిధిలోని వివిధ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కంప్యూటర్స్ సైన్స్ విభాగం అధ్యాపకులు, టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

24 నుంచి వేసవి సెలవులు

ఉదయగిరి, ఏప్రిల్ 2: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 24నుంచి ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం అవుతాయన్నారు.



తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతర ప్రారంభం




బంగారుచీర అలంకరణలో ముత్యాలమ్మ - ఆలయం వద్ద భక్తుల రద్దీ

చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో మంగళవారం ముత్యాలమ్మ జాతర ప్రారంభమైంది.తూర్పుకనుపూరు, ఈదలవారిపాళెం, పోసినవారిపాళెం, రావులవారిపాళెం, కొమరావారిపాళెం గ్రామాల్లో ఘటాన్ని ఊరేగించారు. గంగమిట్ట మీద తాత్కాలికంగా పోలేరమ్మకు వేదిక ఏర్పాటు చేశారు. గుడిసెలో కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తప్పెట్లు, తాళాలతో మోసుకు వచ్చి ప్రతిష్ఠించారు. గాలిగంటల చెట్టు వద్ద కుంభం పోశారు. భక్తులు వేయికండ్ల కుండలలో గండదీపాలను వెలిగించుకుని నెత్తిన పెట్టుకుని, మొలకు వేపాకులు దరించి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ముత్యాలమ్మకు బంగారుచీర అలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.సామూహిక పల్లకీసేవ, పూలంగిసేవ ఘనంగా జరిపారు. రాత్రికి అర్ధరథంపై అమ్మవారిని సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

- చిల్లకూరు

మీ గుడ్లు, చికెన్ తిరిగిచ్చేస్తాం

- ఎమ్మెల్యే కించపరచడం తగదంటూ శ్రీకాళహస్తిలో మైనారిటీల నిరసన ప్రదర్శన -

కరోనా కాలంలో తమకు గుడ్లు, చికెన్ పంపిణీ చేశానంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి పదేపదే ప్రస్తావిస్తూ తమను కించపరచడం బాగాలేదంటూ పలువురు ముస్లిం మైనారిటీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చికెన్, కోడిగుడ్లు, కూరగాయలతో మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.కరోనా సమయంలో ప్రచార ఆర్భాటం కోసం దాతలిచ్చిన కోడిగుడ్లు, చికెన్, కూరగాయలను ఎమ్మెల్యే పంపిణీ చేశారని చెప్పారు. అవి ఒకసారి తీసుకున్న పాపానికి నాలుగేళ్ల నుంచి రోజూ విలేకరుల సమావేశాలు పెట్టి మైనారిటీలను అవహేళన చేస్తున్నారని వాపోయారు. తాము చికెను, కోడిగుడ్లు, కూరగాయలను తిరిగి ఇచ్చేస్తామని వాటిని సంచుల్లో చేత బట్టి ప్రదర్శించారు. పట్టణంలోని కుమారస్వామి తిప్ప కూడలి నుంచి టీడీపీ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది.మైనారిటీల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎలాంటి కృషీ చేయలేదని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో మైనారిటీలంతా వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్, కాసరం రమేష్, మస్తాన్, మీర్జా తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి





జిల్లా కలెక్టర్ లక్ష్మీశపై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. విధుల్లో చేరిన రెండు నెలలకే అవమానకరమైన రీతిలో బదిలీకి గురి కావడంతో పాటు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ ఆదేశించడం గమనార్హం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కలెక్టర్ లక్ష్మీశపై

ఈసీ బదిలీ వేటు

● మరికొందరిపైనా చర్యలకు అవకాశం

ఎమ్మెల్యేని ఇంటికెళ్లి కలిసి....

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత జనవరి ఆఖర్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులంతా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేస్తుండిన లక్ష్మీశ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల నేపథ్యంలో వచ్చినందున జిల్లా ఎన్నికల అధికారిగా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని ప్రజలకు, రాజకీయ పార్టీల నేతలకు నమ్మకం కలిగించే విధంగా ఆయన నడుచుకోవాల్సి వుండింది. కానీ గత జనవరి 31వ తేదీన బాధ్యతలు చేపట్టగా అదే రోజు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికి వెళ్ళి కలిశారు. ఆ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అది తిరుపతిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది. టీడీపీతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులంతా మీడియా సమావేశాలు పెట్టి మరీ ఆయన తీరుపై విమర్శలు, ఆరోపణలు చేశారు. జిల్లాలో నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహిస్తారని కలెక్టర్‌పై తమకు నమ్మకం లేదంటూ ప్రకటించారు.ఎన్నికల కమిషన్‌కు సైతం ఫిర్యాదులు చేశారు. దీంతో ఆయన జిల్లాలో తొలి అడుగే వివాదాస్పదమైంది.

చంద్రగిరి టీడీపీ నేతల ఫిర్యాదులపై ఈసీని తప్పుదోవ పట్టించే ప్రయత్నం

చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు అనేక అంశాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.ఈఆర్వో కార్యాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది అధికార పార్టీ ఎమ్మెల్యేకి అనుకూలంగా పనిచేస్తున్నారనే అంశంపై ప్రధానంగా ఫిర్యాదులు చేశారు. వీటిపై కలెక్టర్‌ను ఈసీ వివరణ కోరగా ఫిర్యాదుల్లో స్పష్టత లేదని ఆయన ఈసీకి సమాధానం ఇచ్చినట్లు సమాచారం.అయితే తాము చేసిన ఫిర్యాదులకు సంబంధించి టీడీపీ నేతలు ఆధారాలను కూడా ఈసీకి సమర్పించి వుండడంతో కలెక్టర్ పనితీరుపై ఈసీ అసంతృప్తికి లోనైనట్లు తెలిసింది.

వైసీపీ ప్రచార సామగ్రి ఉదంతంలో నిర్లక్ష్యం

రేణిగుంట శివార్లలో గత నెల 26వ తేదీన నాలుగు గోదాముల్లో రూ.కోట్ల విలువైన వైసీపీ ప్రచార సామగ్రి పట్టుబడిన సంగతి తెలిసిందే. దీనిపై తొలుత రేణిగుంట టీడీపీ నేతలు గోదాముల వద్ద ఆందోళనకు దిగారు. తర్వాత చంద్రగిరి టీడీపీ నేతలు గోదాముల వద్దే రాత్రంతా కాపలా కాశారు. ఆపై శ్రీకాళహస్తి టీడీపీ నేతలు రంగంలోకి దిగారు.వారూ గోదాముల వద్ద ఆందోళన చేపట్టారు. తిరుపతి టీడీపీ నేతలు కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేశారు. గోదాముల్లో నేరుగా పార్టీకి సంబంధించిన ప్రచార సామగ్రిపై ఎవరికీ పెద్దగా అభ్యంతరాల్లేవు. కానీ కొన్ని గోదాముల్లో ఒకరిద్దరు వైసీపీ నాయకుల వ్యక్తిగత ప్రచారానికి సంబంధించిన సామగ్రి, అలాగే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రి పట్టుబడ్డాయి. వాటిపై పేర్లు, ఫొటోలు కూడా స్పష్టంగా కన్పిస్తున్నా అధికారులు అత్యంత ఉదాసీనంగా వ్యవహరించారు. రేణిగుంట మండల అధికారుల నుంచీ శ్రీకాళహస్తి రిటర్నింగ్ అధికారి దాకా, అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీలు కూడా బాధ్యతగా స్పందించలేదు. నాలుగు రోజుల పాటు వివాదం కొనసాగినా కలెక్టర్ గానీ, ఎస్పీ గానీ గోదాములను పరిశీలించకపోవడం విమర్శలకు దారి తీసింది. ఓటర్లను ప్రలోభపెట్టే సామగ్రి దొరికినపుడు లోతుగా విచారణ జరపడం అటుంచి ఆధారాలు దొరికిన మేరకైనా బాధ్యులకు నోటీసులు జారీ చేయడం, వారిపై చర్యలకు ఉపక్రమించకపోవడం అందరిలో అనుమానాలు రేకెత్తించింది. చివరికి మీడియా ద్వారా కూడా జిల్లా అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాచారం, సమాధానం ఇవ్వలేదు. ఇతర జిల్లాల్లో ఇలాంటి వస్తువులు పట్టుబడినపుడు వాటిని కోర్టులకు స్వాధీన పరిచి, కోర్టుల అనుమతితో వాటిని రిలీజ్ చేయడం జరుగుతోంది. అయితే రేణిగుంట ఉదంతంలో జిల్లా అధికారులు ఆ పద్ధతి పాటించకుండా బిల్లులు చూపించారని చెప్పి నేరుగా సామగ్రిని విడుదల చేయడం విమర్శలకు దారి తీసింది. ఈ వ్యవహారంపై స్థానిక టీడీపీ నేతలతో పాటు విజయవాడలో వివిధ రాజకీయ పార్టీల ముఖ్యనేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలసి ఫిర్యాదు చేశారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల కమిషన్ కలెక్టర్ లక్ష్మీశ తీరు సక్రమంగా, పారదర్శకంగా లేదని భావించి బదిలీ వేటు వేసింది.

జిల్లా పరువు తీస్తున్న అధికారులు

నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిజాయితీగా పనిచేయాల్సిన అఖిల భారత సర్వీసులకు చెందిన అధికారులు తాము తప్పటడుగులు వేయడంతో పాటు ఏకంగా జిల్లా పరువు కూడా తీస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా 2020-21లో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా అరాచక పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. అధికార పార్టీ నేతలు, శ్రేణులు పలుచోట్ల రెచ్చిపోయి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్, తిరుపతి అర్బన్ ఎస్పీ, పలమనేరు డీఎస్పీ, పుంగనూరు, శ్రీకాళహస్తి సీఐలు తమ పరిధిలో జరిగిన ఈ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమయ్యారు. దీంతో 2021 జనవరి 27న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అప్పటి కలెక్టర్ నారాయణ భరత్ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేష్‌రెడ్డిలతో పాటు పలమనేరు డీఎస్పీ, పుంగనూరు, శ్రీకాళహస్తి సీఐలపై బదిలీ వేటు వేశారు. ఈ పరిణామంతో జిల్లా ప్రతిష్ఠ దెబ్బతింది. అదే ఏడాది జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో నకిలీ ఓటరు కార్డులతో దేశవ్యాప్తంగా జిల్లా పరువు పోయిన సంగతీ తెలియంది కాదు. ఆ ఎన్నికల్లో దారుణమైన తప్పిదాలకు బాధ్యులుగా మారడంతో అప్పటి తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి తదుపరి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా వుండిన గిరీశపై ఈ ఏడాది జనవరి 19న ఈసీ సస్పెన్షన్ వేటు వేసింది. ఆ క్రమంలో తిరుపతి డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి సహా ఇద్దరు సీఐలు, కిందిస్థాయి సిబ్బంది కూడా సస్పెండయ్యారు. ఈ రెండు ఘటనలతో జిల్లా ప్రతిష్ఠ దెబ్బతిందని ప్రజానీకం బాధపడుతున్న తరుణంలో తాజాగా కలెక్టర్ లక్ష్మీశ సస్పెన్షన్ జిల్లా పరువు మరోసారి గంగలో కలిసినట్లయింది. ఐఏఎస్ కెరీర్‌లో తొలిసారి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన లక్ష్మీశ 60 రోజుల స్వల్ప వ్యవధిలోనే ఈసీ కన్నెర్రకు గురై బదిలీ కావడం, ఎన్నికల ప్రక్రియ ముగిసే దాకా ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ ఆదేశించే పరిస్థితి రావడం జిల్లా అధికార, ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మూడేళ్ల వ్యవధిలో మూడు పర్యాయాలు జిల్లా వేదికగా జరిగిన ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి కీలక అధికారులు ఎన్నికల కమిషన్ చర్యలకు గురి కావడం మాత్రం నిస్సందేహంగా జిల్లా ప్రతిష్ఠను మసకబారేలా చేసింది.

జిల్లాలో మరికొందరిపైనా చర్యలు?

ప్రస్తుతానికి జిల్లా ఎన్నికల అధికారి హోదాలో వున్న కలెక్టర్ లక్ష్మీశ బదిలీ వేటుకు గురి కాగా తదుపరి జిల్లాలో మరికొందరు అధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశముందని సమాచారం. ముఖ్యంగా చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు చెందిన కీలక అధికారుల తీరు పట్ల ప్రతిపక్ష పార్టీల నాయకులు అపనమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. వారి తీరుపై ఆధారాలతో ఇప్పటికే ఈసీకి ఫిర్యాదు చేశారు. అలాగే మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో పలువురు అధికారులు, ఉద్యోగులు అధికార పార్టీకి అనుకూలంగా ఏకపక్షంగా పనిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చాలావరకూ ఆధారాలు జతచేసి మరీ టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేస్తున్నారు. ఆ క్రమంలో రానున్న కొద్ది రోజుల్లో మరికొందరిని కూడా ఎన్నికల విధుల నుంచీ తప్పించే అవకాశముంది.

ఇంఛార్జి కలెక్టర్‌గా జేసీ ధ్యానచంద్ర



తిరుపతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బదిలీ అయ్యారు. ఈసీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆయనను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రకు ఛార్జి అప్పగించి కలెక్టర్ లక్ష్మీశ రిలీవ్ అయ్యారు. ప్రధాన కార్యదర్శి జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల్లో ఆయనకు తదుపరి పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలనా శాఖలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. కాగా ఆయన స్థానంలో ఇంఛార్జి కలెక్టర్‌గా జేసీ ధ్యానచంద్ర బాధ్యతలు చేపట్టారు. రెగ్యులర్ కలెక్టర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. ప్రధాన కార్యదర్శి ముగ్గురు ఐఏఎస్ అధికారుల పేర్లతో కూడిన ప్యానెల్‌ను ఈసీకి నివేదించాల్సి వుంది. అందులో ఈసీ సూచించిన అధికారిని తిరుపతి కలెక్టర్‌గా నియమించనున్నారు. దీనికి సంబంధించి ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు రానున్నాయి.

అధికారులకు బదిలీలు సాధారణం:లక్ష్మీశ

ప్రభుత్వ అధికారులకు బదిలీలు సర్వ సాధారణమని బదిలీ అయిన కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. జిల్లాలో పనిచేసింది కొద్ది రోజులే అయినా శ్రీవారి పాదాల వద్ద పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బదిలీకి గురి కావడంపై మాట్లాడుతూ ఏమి జరిగిందో తనకు తెలియదన్నారు. తాను ఎన్నికల ప్రక్రియలో చిత్తశుద్ధితో పని చేశానని, జిల్లా అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేశానన్నారు.

చిత్తూరు ఎస్పీ జాషువాపైనా



చిత్తూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎస్పీ జాషువాపై మంగళవారం ఈసీ బదిలీ వేటు వేసింది. విధుల్లో చేరిన రెండు నెలలకే అవమానకరమైన రీతిలో బదిలీకి గురి కావడంతో పాటు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ ఆదేశించడం గమనార్హం. 'మనం ఎన్నికల సంఘం పరిధిలో పనిచేస్తున్నాం. ఏ పార్టీకీ అనుకూలంగా ఉండొద్దు. నిక్కచ్చిగా వ్యవహరించండి' అంటూ నిత్యం పోలీసు అధికారుల సమావేశాల్లో, టెలీ కాన్ఫరెన్సుల్లో చెప్పే ఎస్పీ జాషువా.. లోపల మాత్రం వైసీపీకి అనుకూలంగా చేయాల్సిందంతా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తారనే ఆయన్ను బదిలీపై జిల్లాకు పంపినట్లు తెలుస్తోంది. గతంలో విజయవాడ శాంతిభద్రతల డీసీపీ, కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేసినప్పుడు కూడా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. వైసీపీకి విధేయుడనే ముద్ర వేసుకోవడంతోనే జిల్లాకు వచ్చారనే ప్రచారం జరిగింది. దీనికి బలం చేకూరేలా ఆయన జిల్లాకు వచ్చిన వెంటనే తన టీమ్‌ను సిద్ధం చేసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొన్ని రోజుల ముందే జిల్లాలో అటాచ్‌మెంట్‌లో ఉన్న సుమారు 200 మంది సిబ్బందిని పూర్వ స్థానాలకు బదిలీ చేశారు. దీంతో పాటు కీలకమైన స్పెషల్ బ్రాంచి విభాగంలోనూ 14 మందితో టీమ్‌ను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఇలా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించే ఎస్‌ఐ, సీఐలను క్షేత్రస్థాయిలో సిద్ధంచేసినట్లు ప్రచారంలో ఉంది. ఆయన వచ్చాక 400 మందికిపైగా టీడీపీ శ్రేణుల్ని బైండోవర్ చేసినట్లు సమాచారం. ఇలా జిల్లాలో వైసీపీ విజయానికి అవసరమైన ప్లాన్ అమలులో భాగస్వామ్యం అయ్యారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా.. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న కొందరు కలెక్టర్లు, ఎస్పీలపై కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. అందులో ఎస్పీ జాషువా కూడా ఉన్నారు. దీనిపై విచారించి తగిన ఆధారాలను సేకరించిన కేంద్ర ఎన్నికల సంఘం.. రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు చిత్తూరు ఎస్పీని కూడా బదిలీ చేసి, ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. ఫిబ్రవరి 4న బాధ్యతలు స్వీకరించిన జాషువా.. ఏప్రిల్ 2న బదిలీ వేటుకు గురయ్యారు. అడ్మిన్ ఏఎస్పీ అరీఫుల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా వ్యవహరించనున్నారు. నేడో రేపో కొత్త ఎస్పీని నియమించే అవకాశముంది.



తిరుపతిలో తొలి తల్లిపాల నిధి



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 2: రాష్ట్రంలోనే తొలి తల్లిపాల నిధి తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి- శిశువైద్యశాలలో ఏర్పాటవుతోంది. తిరుపతి రోటరీక్లబ్ రూ.35 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ తల్లిపాల సేకరణ కేంద్రాన్ని నేటి ఉదయం పది గంటలకు ప్రారంభిస్తారు.

ఎందుకు: పుట్టిన బిడ్డలకు తల్లి పాలే తొలి వ్యాక్సిన్. కానుపులో చనిపోయిన తల్లుల బిడ్డలకు, నెలలు నిండకుండానే పుట్టిన పిల్లలకు తల్లిపాలు అవసరం. వీరికి తల్లిపాల నిధి నుంచి పాలను పంపిణీ చేస్తారు.


సేకరణ ఎలా: అధికంగా పాలుపడిన తల్లుల నుంచి పాలు సేకరిస్తారు. బ్రెస్ట్ పంప్ ద్వారా ఒక్కొక్కరి నుంచి 30-40మిల్లీ లీటర్ల పాలు సేకరిస్తారు. పాశ్చరైజేషన్ చేసి డీప్ ఫ్రిజ్‌లో నిల్వవుంచుతారు. తీవ్రమైన జబ్బులు లేకుండా, ఆరోగ్యంగా ఉండే తల్లులు తమ బిడ్డలకు పట్టగా మిగిలే తల్లిపాలను మాత్రమే సేకరించి ఈ కేంద్రంలో నిల్వ చేస్తారు. ప్రసవించిన నాలుగు రోజుల తరువాత నుంచి గరిష్ఠంగా ఎన్ని రోజుల వరకైనా తల్లులు తమ పాలను వితరణ చేయవచ్చు.

ఎంత కాలం ఉంటాయి: మూడు నెలల పాటూ ఈ పాలను పిల్లలకు తాగించవచ్చు.

ఇలా పాలను ఇవ్వడం వల్ల నష్టం లేదా : తల్లికి మంచిది కూడా. ఇందువల్ల మహిళలకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు బాగా తగ్గుతాయి. ప్రోలాక్టిన్ అనే హార్మోను ఉత్పత్తి అవుతుంది. ఇది కుటుంబ నియంత్రణకు సహకరిస్తుంది. ఎక్కువ కాలం పాలను ఇవ్వడం ద్వారా నెలసరి రాకుండా వాయిదాపడి రక్తస్రావ నష్టం నివారింపబడుతుంది.

ఆరుగురు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

తిరుపతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని 6 శాసన సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థులను పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ మంగళవారం ప్రకటించింది.గూడూరుకు చిల్లకూరి వేమయ్య , సూళ్లూరుపేటకు గాది తిలక్‌బాబు, చంద్రగిరికి కనుపర్తి శ్రీనివాసులు, శ్రీకాళహస్తికి డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు , సత్యవేడుకు బాలగురవమ్ బాబు, నగరికి రాకేష్‌రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించారు.తిరుపతి, వెంకటగిరి స్థానాలకు మాత్రం అభ్యర్థులను ప్రకటించలేదు.



గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

వైసీపీని గద్దె దించేందుకు కలిసికట్టుగా పోరాటం: పాశం



ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 2: రాష్ట్రంలో విధ్వంస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించేందుకు అందరం కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మిటాత్మకూరు, పగడాలపల్లి, మంగళపూరు, వెడిచెర్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదలకు పెన్షన్లు కూడా అందించలేదని స్థితిలో ఉందన్నారు. ఐదేళ్లపాలనలో రాష్ట్రంలో అన్ని వనరులను వైసీపీ నాయకులు కొల్లగొట్టారని ఆరోపించారు. గాడితప్పిన రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపించాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. అలాగే పెన్షన్ రూ.4వేలకు పెంచి ఇంటి వద్దే అందించేలా చంద్రబాబునాయుడు బాధ్యత తీసుకుంటారన్నారు. పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, దుద్దా రాఘవరెడ్డి, నంబూరు వెంకటేశ్వర్లు నాయుడు, పుట్టి వెంకటేశ్వర్లు, గోపాలయ్య నాయుడు, శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మధురెడ్డి, మట్టం శ్రావణి, రఘునాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్‌వి చీప్ పాలిటిక్స్: రామకృష్ణ



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఏప్రిల్ 2: సీఎం జగన్ చీప్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల ద్వారా వెంటనే అవ్వా తాతలకు పింఛన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పేదల సంక్షేమ పథకాల నిధులను దారిమళ్లించిన జగన్ తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లుకు పంచిపెట్టారని విమర్శించారు. దీంతో ఖజానాలో చిల్లిగవ్వ లేక పింఛను డబ్బులు ఇవ్వలేకపోతున్నారని, తాను చేసిన దుర్మార్గ పనులను కప్పిపుచ్చేందుకు చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎన్నికల్లో ఎలాంటి తీర్పు ఇవ్వాలో వారికి బాగా తెలుసన్నారు. వలంటీర్లు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తుండడం వల్లనే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథనాయుడు, అవ్వారు సత్యనారాయణ, మల్లారం బాబు, గల్లా శ్రీనివాసులు నాయుడు, వల్లభనేని మధుసూదన నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, మంకు ఆనంద్ చలపతి, ముప్పాళ మునేంద్ర నాయుడు, చెంగారవు, సుధ, నరిసింహులు, హేమత్ చౌదరి, నాని, చంటి, విష్ణు తదితరులు వున్నారు.

దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించరు: టీడీపీ



మండల కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

కోట, ఏప్రిల్ 2: అవ్వా తాతల పెన్షన్ల పంపిణీ నుంచి వలంటీర్లను ఎన్నికల కమిషన్ పక్కనపెడితే... టీడీపీపై దుష్ప్రచారం చేయడం సరికాదని ఆ పార్టీ నాయకులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో శంకరయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తీసుకునే నిర్ణయాలకు తమ పార్టీకి ఆపాదించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఓటర్లను తప్పుదారిపట్టించేందుకు జగన్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి తీగల సురేష్‌బాబు, మోహన్‌రెడ్డి, మస్తాన్‌బాషా, వెంకటకృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌బాబు, సుబ్రహ్మణ్యం యాదవ్, వేణు, శ్రీనివాసులు, తల్లం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు కాంగ్రెస్ అభ్యర్థిగా వేమయ్య



గూడూరు, ఏప్రిల్ 2: గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చిల్లకూరు వేమయ్యను ఆ పార్టీ అధిష్టానం మంగళవారం ప్రకటించింది. చిల్లకూరుకు చెందిన వేమయ్య మాట్లాడుతూ 1990 నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. 1995-2000 మధ్య చిల్లకూరు ఎంపీటీసీ సభ్యుడిగా, 2020లో గూడూరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా, 2021-22లో చిల్లకూరు మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 2023 నుంచి కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

దహించిన వంటల ఆట

అగ్నిప్రమాదంలో ఐదేళ్ల చిన్నారి మృతి



మీనాక్షి (పాత చిత్రం)

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: ఇంటి వద్ద వంట బుడిగీలతో ఆడుకుంటున్న మీనాక్షి(5) అనే చిన్నారిని అగ్నిప్రమాదం దహించింది. ఈ ఘటన మంగళవారం శ్రీకాళహస్తిలో వెలుగు చూసింది. వివరాలిలా.. శ్రీకాళహస్తి పట్టణం దేవరమిట్టకు చెందిన గణేష్ దంపతులు ఇంటి వద్ద చేపలు తోముకుంటూ జీవనం సాగిస్తుంటారు. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో గణేష్ దంపతులు చేపల పనిలో నిమగ్నమయ్యారు. సెలవు రోజు కావడంతో పెద్ద కూతురు మీనాక్షి ఇంటి పక్కన వంట బుడిగీలతో ఆడుకుంటుండగా నిప్పురవ్వలు పక్కనే ఉన్న చెత్తకు అంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. చిన్నారి గౌనుకు మంటలు వ్యాపించడంతో తీవ్రంగా గాయపడి కేకలు వేసింది. పాప అరుపులు విన్న కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మీనాక్షి మృతి చెందింది. శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అగ్నిప్రమాదం కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులు అప్పగించారు. ఆడుకునే చిన్నారి అనంత లోకాలకు చేరడంతో దేవరమిట్ట ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తడ, ఏప్రిల్ 2: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మండల పరిధిలోని పాములమిట్ట గ్రామానికి చెందిన బూదూరు జానకి ఇంట్లో గత శుక్రవారం చోరీ జరిగింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన వ్యక్తి మునిప్రకాష్ చోరీకి పాల్పడినట్లుగా అనుమానించి అదుపులో తీసుకొని విచారించారు. చోరీ తానే చేసినట్లుగా అంగీకరించాడు. అపహరించిన ఏడు సవర్ల బంగారు ఆభరణాలు మునిప్రకాష్ ఇంట్లోనే గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

పాతకక్షలతో దాడి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 2: పాత కక్షల కారణంగా కత్తితో దాడిచేసి గాయపరచిన ఘటన పట్టణంలోని బీడీ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కాలనీలో నివాసం ఉంటున్న ప్రసాద్‌కు అదే కాలనీలో నివాసం ఉంటున్న మౌళి యాక్షాద్ మధ్య పాత కక్షలు ఉన్నాయి. సోమవారం ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ప్రసాద్‌పై మౌళియాక్షాద్ కత్తితో దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు హుటహుటిన ప్రసాద్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

భానుడి భగభగలు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 2: సూర్యుడు భగభగ మండిపోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. వెంకటగిరి పట్టణంలో మంగళవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. ఎండవేడికి తట్టుకోలేక ప్రజలు బయటకు రాకపోవడంతో పట్టణంలో ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు సైతం జన సంచారం లేక బోసిపోయాయి.





వేయికండ్ల కుండలను నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు - విద్యుత్‌దీపాలంకరణలో ఆలయం

తూర్పుకనుపూరులో జాతర సందడి

చిల్లకూరు, ఏప్రిల్ 2: మండలంలోని తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతర సందడి నెలకొంది. జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారికి సామూహిక పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి విశిష్ట పూజలు జరిపారు. బంగారుచీర అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల రద్దీ పెరగడంతో రద్దీ నెలకొంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం కంచి కామకోటి పీఠం, టీటీడీ అస్థాన విద్యాన్‌లచే గొప్ప నాదస్వర కచ్చేరి నిర్వహించారు. ఆలయ ఆవరణంలో వివిధ దుకాణాలు, రంగులరాట్నాలను ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా 400 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జాతర సవ్యంగా జరిగేలా భక్తులు సహకరించాలని కోరారు. ఆయన వెంట డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ వేణు గోపాల్‌రెడ్డి, ఆలయ ఈవో నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.







రంగులరాట్నం - కంచి కామకోటి పీఠం, టీటీడీ అస్థాన విద్యాన్‌ల నాదస్వర కచ్చేరి - ఆలయం వద్ద ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

విజయశ్రీ విజయమే లక్ష్యం: టీడీపీ



పరసారత్నం, నెలవల, విజయశ్రీని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, ఏప్రిల్ 2: సూళ్లూరుపేట టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ విజయమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేస్తున్నామని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసారత్నం, సూళ్లూరుపేట ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. మంగళవారం పెళ్లకూరు మండలంలోని పసుపుకంచ్రిగ, పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు, అనకవోలు, పెరుమాళ్లపల్లి గ్రామాల్లో అభ్యర్థి విజయశ్రీతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరసా, నెలవల మాట్లడుతూ మట్టి, ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాతో సంపాదించిన డబ్బుతో ఓటర్లను ప్రలోభపెట్టి గెలవాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నేతలు ఎన్ని కుట్రలు పన్నినా టీడీపీ అభ్యర్థి విజయశ్రీ విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని పేర్కొన్నారు. అనకవోలు గ్రామంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో మహిళలు అడుగడునా నీరాజనం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పేరం రమేష్‌నాయుడు, కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, గంగాబత్తిన రామకృష్ణా, హరినాయుడు, రామచంద్రారెడ్డి, మునీష్, కృష్ణమనాయుడు, మునిరామయ్య, సిద్దులయ్య నాయుడు, గురవారెడ్డి, గురవయ్య, బాలరాజు, పునబాక పోలయ్య, ఉచ్చూరు వెంకటయ్య, ఏడుకొండలు, పరుశురాం, వెంకటేశ్, చంద్ర, రవి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం వలంటీర్ల రాజీనామా



ఎంపీడీవో శంకరయ్యకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

కోట, ఏప్రిల్ 2: మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీకి చెందిన 14 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఎంపీడీవో శంకరయ్యను కలిసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. తామంతా స్వచ్ఛందంగా తమ రాజీనామా చేస్తున్నామని, ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లు లేవని తెలిపారు. రాజీనామా పత్రాలను కలెక్టర్‌కు పంపి, ఆయా వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో తెలిపారు.

రాజీనామాలు సరే.. డివైజర్లు, సెల్‌ఫోన్లు ఏవీ..?

కోట, ఏప్రిల్ 2: కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని వలంటీర్లు రాజీనామాలు చేశారేగానీ ప్రభుత్వం ఇచ్చిన డివైజర్లు, సెల్‌ఫోన్లు అందజేయలేదు. మండలంలోని 21 పంచాయతీల్లో 290మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరిచేత రాజీనామా చేయించి ఎన్నికల్లో ప్రచారానికి వాడుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజీనామాలు చేసి వైసీపీ తరపున ప్రచారం చేస్తే అధికారంలోకి వచ్చాక అదే వలంటీర్ పోస్టులు తిరిగి ఇస్తామంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు. కొంతమంది వలంటీర్లు రాజీనామాలకు అంగీకరించకపోవడంతో మండల, పంచాయతీ స్థాయి నాయకులు వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి రాజీనామాలకు ప్రోత్సహిస్తున్నారు. వైసీపీ నేతలు దగ్గరుండి రాజీనామా పత్రాలు రాయిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కొత్తపట్నం పంచాయతీలోని 14 మంది వలంటీర్లు రాజీనామా చేసినా వారికి ప్రభుత్వం అందజేసిన డివైజర్లు.. సెల్‌ఫోన్లు తిరిగి అప్పగించలేదని తెలిసింది. దీనిపై ఎంపీడీవో శంకరయ్య ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. ప్రభుత్వం అందజేసిన డివైజర్లు... సెల్‌ఫోన్లు తిరిగి అప్పగించని వలంటీర్లపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా బుధవారం నియోజకవర్గంలోని పలు మండలాలలో వలంటీర్ల చేత రాజీనామాలు చేయించేందుకు వైసీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

ఓటు వజ్రాయుధం: ఆర్డీవో



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో చంద్రముని, అధికారులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 2: ప్రజాస్వామ్యాన్ని కాపాడే గొప్ప వజ్రాయుధం ఓటు అని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ మంగళవారం నాయుడుపేట పట్టణంలోని గడియారం సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు అధికారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడి దేశ భవిష్యత్తును నిర్దేశించేది ఓటు హక్కు అని పేర్కొన్నారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోండి

వెంకటగిరి, ఏప్రిల్ 2: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.విజయశేఖరం అన్నారు. మంశవారం పట్టనంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. త్రిభువనీ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ వెంకటసుబ్బయ్య, ఎన్‌సీసీ సీటీవో డాక్టర్ బీ.సతీష్, అధ్యాపకులు ఉమామహేశ్వరావు, పెది నారాయణ, జోతీశ్వర నాయుడు, హనుమంతరావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు టికెట్లు ఇవ్వాలి: ఎమ్మార్పీఎస్

గూడూరు అర్బన్, ఏప్రిల్ 2: ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాదిగలకు అవకాశం ఇవ్వాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం కోరారు. మంగళవారం స్థానిక పోస్టాఫీసు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు మాదిగలను ఓటుబ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయే తప్ప ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలను అరికట్టండి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 2: పట్టణంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఓ ఇంటల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంగళవారం స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

బాలాయపల్లి, ఏప్రిల్ 2: బాలాయపల్లి మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుర్గాటి పవన్ డిగ్రీ పూర్తి చేసి ఎక్స్‌కవేటర్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. వెంకటగిరి మండలం గొట్లగుంట గ్రామానికి చెందిన మౌనిక స్థానికంగా ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వీరిద్దరూ రెండ్రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని మంగళవారం పోలీసులను ఆశ్రయించారు.

శాశ్వత ఆదాయం కల్పిస్తేనే అభివృద్ధి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 2: పేదకు శాశ్వత ఆదాయం కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా అభివృద్ధి జరగడంలేదన్నారు. సంక్షేమ పథకాల ద్వారా వేలకోట్ల రూపాయలు అందిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా ఆ సొమ్ము పేదల అభివృద్ధికి ఉపయోగపడడం లేదన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకే లిబరేషన్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి పార్లమెంటు అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని విజయ్‌కుమార్ తెలిపారు.

సిద్ధం సభకు బస్సులు

ప్రయాణికులకు ఇబ్బందులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన వైసీపీ సిద్ధం సభకు సూళ్లూరుపేట డిపో నుంచి 15బస్సులు తరలివెళ్లాయి. దీంతో తిరుపతి, నెల్లూరు, చెన్నై మార్గాల్లో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. కనుపూరులో మంగళవారం నుంచి జాతర ప్రారంభం కావడంతో సూళ్లూరుపేట నుంచి బస్సుల్లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అగ్నిమాపక పరికరాల అందజేత

నాయుడుపేట, ఏప్రిల్ 2: సెజ్‌లోని పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన రూ.16 లక్షల విలువ చేసే అగ్నిమాపక పరికరాలు గ్రీన్‌టెక్ పరిశ్రమ అందజేసింది. మంగళవారం పరిశ్రమ ఎండీ చెంగ్‌చిన్‌చెన్ అగ్నిమాపక జిల్లా అధికారి రమణయ్యకు అగ్నిమాపక పరికరాలను అందజేశారు. ఇందులో 5 బోట్‌లు, 50 లైట్‌రింగ్‌లు, 50హెల్మెట్లు, 50 నైట్ జాకెట్‌లు ఉన్నాయి. చెంగ్‌చిన్‌చెన్‌ను అగ్నిమాపక జిల్లా అధికారి రమణయ్య అభినందించారు. కార్యక్రమంలో గ్రీన్‌టెక్ వైస్ ఛైర్మన్ జయరామ్, హెచ్‌ఆర్‌వో పవన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు జగన్

తిరుపతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ బుధవారం తిరుపతి జిల్లాకు రానున్నారు. మేమంతా సిద్ధం పేరిట జరుపుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి చిత్తూరు జిల్లాలో అడుగిడిన ఆయన సదుం మండలం అమ్మగారిపల్లెలో రాత్రి బసచేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు అమ్మగారిపల్లె నుంచి బయలుదేరి రోడ్డుమార్గంలో సదుం, దామలచెరువు, గుండ్లపల్లి, తలుపులపల్లి మీదుగా మధ్యాహ్నం 12.30గంటలకు తేనేపల్లెకు చేరుకుంటారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 4 గంటలకు రోడ్ షోగా బయల్దేరి 4.30 గంటలకు పూతలపట్టుకు చేరుకుంటారు. 5.30గంటల వరకు బహిరంగసభలో ప్రసంగిస్తారు. తరువాత గొల్లపల్లి, గాదంకి, మామండూరు మీదుగా తిరుపతి జిల్లా రేణిగుంటకు చేరుకుంటారు.బుధవారం రాత్రి ముఖ్యమంత్రి రేణిగుంటలోనే బసచేసి గురువారం సాయంత్రానికి బస్సుయాత్రగా నాయుడుపేటకు చేరుకుంటారు.అక్కడ జరిగే సభలో పాల్గొంటారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 2: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలందరూ రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి టీడీపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక వరదానగర్ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, వీరుబోయిన వెంకటేశ్వర్లు, నిమ్మకాయల నరసింహులు, తిరుపాలు, కృష్ణకుమారి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై జగన్‌ది కపట ప్రేమ: వరప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న వరప్రసాద్

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2: ఎస్సీ, ఎస్టీల పట్ల సీఎం జగన్ కపట ప్రేమ చూపుతున్నారని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ అన్నారు. మంగళవారం సూళ్లూరుపేటలో ఆయన టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 27మంది దళిత ఎమ్మెల్యేల్లో 23 మందికి టికెట్లు ఇవ్వకుండా పక్కన పెట్టిన జగన్ నా ఎస్సీలు.. నా ఎస్టీలు అంటూ కపటత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. నీతి నిజాయతీగా పనిచేశానని, అయినా పార్టీలో తనను చులకనగా చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ మాట్లాడుతూ మూడు పార్టీల సమన్వయంతో టీడీపీ విజయం సాధించబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, బొమ్మన్ పళణి, వెంకటసుబ్బయ్య, జనార్ధన్ ఉన్నారు.

ఇంటి వద్దే పెన్షన్ అందజేయండి



ఎంపీడీవో రాజశేఖర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

గూడూరు, ఏప్రిల్ 2: పెన్షన్ లబ్ధిదారులకు వారి ఇంటి వద్దకే వెళ్లి అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో రాజశేఖర్‌రావుకు, మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది ప్రకాశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, తూపిలి సురేంద్ర, జనార్దనరెడ్డి, శివప్రసాద్, గురవయ్య, అమరయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈవోపీఆర్‌డీ మాణిక్యంకు టీడీపీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావతి, వెంకటేశ్వర్లునాయుడు, సతీష్, రమణయ్య తదితరు పాల్గొన్నారు.

వాకాడు: మండల పరిధిలోని సచివాలయ సిబ్బంది చేత పింఛన్లు ఇప్పించాలని టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం మంగళవారం అందజేశారు. కుంచం దయాకర్, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, బత్తిన ప్రమీల, అన్నమేటి చంద్రయ్య, దోశకాయల కృష్ణమూర్తి, తీపలపూడి రమణయ్య, మామిడి గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పింఛన్లను ఇంటి వద్దకే వెళ్లి అందించాలని కోరుతూ ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్‌కు మాజీ జడ్పీటీసీ శ్రీరామ్‌ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అవధానం సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్లు అందజేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య ఎంపీడీవో చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు వెంకటేశ్, సుధాకర్ రెడ్డి, వంకా రమేష్, తిరుపాల్, గురకల తిరుమలరావు, మురళి రెడ్డి, ఎల్లయ్య, సామంత మల్లాం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తడ: లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్లు అందజేయాలని కోరుతూ టీడీపీ నాయకులు ఎంపీడీవో ఆమోద్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, నాయకులు నీలకంఠం, శివాజీ, మనోహర్, రామమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.